www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
బుధవారం 14 మే 2025
సంపుటి :06 సంచిక : 343 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## మే మాసంలోనే జొన్నలు పూర్తిగా కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

మిగతా2లో..

## కుటుంబ సమేతంగా సిఎంను కలిసిన సమాచార కమిషనర్లు



**హైదరాబాద్,మే13( వెలుతురు):** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సమాచార కమిషనర్లుగా నియమితులైన నలుగురు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా కుటుంబ సమేతంగా కలిసి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లు తమ కుటుంబాలతో సిఎంను కలవడం విశేషం. వారికి సిఎం అభినందనలు తెలిపారు.

## సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

- రాజీవ్ యువ వికాసం స్కీమ్‌పై భట్టి



**భద్రాద్రి కొతగూడెం,మే13( వెలుతురు):** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మిగతా2లో..

## శాతవాహన వర్సిటీలో 'లా కాలేజీ'కి బార్ కౌన్సిల్ ఆమోదం

- ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు షురూ...
- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి
- గతంలో న్యాయశాఖ మంత్రిని కలిసిన బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు మే 13:**



కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) మంజూరు కోసం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన క్రుషి ఫలించింది. లా కళాశాల అనుమతికి లా కళాశాల అనుమతికి బార్



లా కాలేజీ అనుమతి కోరుతూ గత నెల మొదటి వారంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసిన బండి సంజయ్, సునీల్ రావు, ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ (ఫైల్ ఫోటో...)

మిగతా2లో..

## పదవీవిరమణ చేసిన జస్టిస్ట్ సంజీవ్ ఖన్నా

- ఘనంగా వీడ్కోలు పలికిన బార్ అసోసియేషన్
- తదుపరి ఎలాంటి పదవులు చేపట్టబోనున్న ఖన్నా
- నేడు సుప్రీం చీఫ్ జస్టిస్‌గా గవాయ్ ప్రమాణం
- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



**న్యూఢిల్లీ,మే13( వెలుతురు):** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మంగళవారం తో ముగిసింది. సుప్రీంకోర్టులో చివరి రోజు బెంచ్ కార్యలాపాలు ముగిసిన తర్వాత ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఖన్నా మాట్లాడారు. మిగతా2లో..

## ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

- యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు
- ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన మోడీ
- సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని

### అది మన సంప్రదాయం.. విధానం కూడా

### వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా

### ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్ నినాదం







**చండీఘడ్,మే13( వెలుతురు):** ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావిత రాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నారన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగు తోందని తెలిపారు. మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో ఆయన మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతి రూపమని పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమన్నారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ ప్రశంసల జల్లు మిగతా2లో..



మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆర్టీఐ కమిషనర్ లుగా నియమితులైనా బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్.. ఆర్టీఐ కమిషనర్లుగా బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ లను సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు మే 13:

## ఆసుపత్రుల నిర్మాణంలో ఆలస్యం

- అధికారుల తీరుపై మండిపడ్డ కోమటిరెడ్డి



**హైదరాబాద్,మే13( వెలుతురు):** సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం ఆలస్యం అవుతుండడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కుంటిసాకులతో నిర్మాణాలను ఆలస్యం చేయడంపై తీవ్ర మిగతా2లో..

## సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన వసతులు


- విద్యా సంవత్సరానికి ముందే ఏర్పాట్లు
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్,మే13( వెలుతురు):** సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన సేవలు అందించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎస్ రామకృష్ణారావు మిగతా2లో..

## పాలన అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోయడం కాదు

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగుల కొరత
- ధాన్యం కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మృగ్యం
- రైతుల ఆత్మహత్యలకు మీరే కారణం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్,మే13( వెలుతురు):** ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించాలని.. రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రైతులను గాలికి వదిలేసి.. మిగతా2లో..

## తరతరాలుగా గూడులేని చెంచులకు 10 వేల ఇందిరమ్మ ఇండ్లు

**ఐటిడిఎ పరిధిలోని ఎస్టీ నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు**

**గవర్నర్ , సిఎం ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం**

**రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు మే 13:** తరతరాలుగా సొంత ఇండ్లకు నోచుకోని ఆదిమ గిరిజన తెగలలోకి అతి బలహీన వర్గమైన చెంచుల సొంతింటి కలను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేయబోతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐటిడిఎ)ల పరిధిలో సచ్యురేషన్ పద్ధతిలో దాదాపు పదివేల చెంచు కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.

ఇందిరమ్మ ఇండ్లపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గారు పలు సందర్భాలలో సూచించడం జరిగిందని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని గవర్నర్ గారు, ముఖ్యమంత్రిగారి సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు.

అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని. వీరు అడవుల్లో వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని . చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరు. అందుకే వీరు జీవించే మిగతా3లో..

## ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం

- 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం
- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,మే13( వెలుతురు):** అక్షర క్రమంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో సైతం ఆ స్థానంలో నిలిపేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అలాగే దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా మిగతా2లో..

## ఆపరేషన్ సిందూర్‌తో భారీగా నష్టం

- మెల్లగా వాస్తవాలు అంగీకరిస్తున్న పాక్
- 11మంది సైనికులు చనిపోయారని ఆర్మీ వెల్లడి



**ఇస్లామాబాద్,మే13( వెలుతురు):** పహల్గామ్ దాడి తర్వాత భారత్ తీసుకున్న చర్యల కారణంగా పాకిస్తాన్ భారీ నష్టాలను చవిచూసింది. ఆపరేషన్ సిందూర్‌లో, పాకిస్తాన్‌లో పెంచి పోషించిన అనేక మంది భయంకరమైన ఉగ్రవాదులను నాశనం చేశారు. ఆ తర్వాత పాక్ భారత్ పై దాడి చేసింది. భారత్ జరిపిన ప్రతీకార దాడుల్లో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. పాకిస్తాన్ స్వయంగా దీనిని అంగీకరించింది. భారత మిగతా2లో..

## కాశ్మీర్ విషయంలో భారత్ విధానం యధాతథం

- కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అంగీకరించబోం
- పివోకెను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానం
- విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్



**న్యూఢిల్లీ,మే13( వెలుతురు):** ఆపరేషన్ సింధూర్‌పై భారత విదేశాంగ శాఖ మంగళవారం కీలక ప్రకటన చేసింది. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్ విధానంలో మిగతా2లో..

(మొదటి పేజీ తరువాయి..)

## మే మాసంలోనే జొన్నలు పూర్తిగా కొనుగోలు చేయాలి



**ఆదిలాబాద్ వెలుతురు మే 13:** జూన్ మాసంలో వ్యవసాయ పనులు మొదలుకానున్న నేపథ్యంలో రైతులు పండించిన జొన్న పంటను మే మాసం లోపే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులకు సూచించారు. సాత్నాల మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు, ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ జొన్నల కొనుగోలుపై అసెంబ్లీలో మాట్లాడంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి కి విన్నవించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ జిల్లాలో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 30 నుండి 35 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని, అకాల వర్షాల నేపథ్యంలో త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. త్వరలో కలెక్టర్, మార్కెట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలను పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు. మహారాష్ట్ర నుండి తెచ్చిన జొన్నలను కొందరి రైతుల పేరిట అమ్ముతున్నారనే సమాచారం అందిందని, ఇలా చేస్తే మన రైతులే నష్టపోతారని తెలిపారు. ఇప్పటికే పలు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని అన్నారు. రైతులు తమ గ్రామానికి ఇచ్చిన తేదీల ప్రకారం, ప్రభుత్వ నిబంధనల మేరకు జొన్న పంటను తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు, నాయకులు సుభాష్ అశోక్ రెడ్డి సంతోష్ సన్నీ శివ తదితరులున్నారు

## శాతవాహన వర్శిటీలో 'లా కాలేజీ'కి బార్ కౌన్సిల్ ఆమోదం

కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. 120 మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్‌ఎల్ బి కోర్సు ప్రారంభం కానుంది. శాతవాహన వర్శిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లారు. సంబంధిత శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్ల ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మొత్తం 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీ నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై వర్శిటీ గా శాతవాహన వర్శిటీని వర్శిటీ గా తనిఖీ చేయడంతోపాటు వివరాలతో కూడిన నివేదిక కోరిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరాలన్నీ నివేదికను పంపినట్లు తెలిపారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అతి త్వరలోనే శాతవాహన వర్శిటీకి అనుబంధంగా తొందరలో లా కాలేజీ అనుమతి ఇవ్వడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం(2005-26) హామీ ఇచ్చారు. న్యాయశాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం లా కాలేజీ అనుమతికి ఆమోదం తెలపడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుండే ఎల్ ఎల్ బీ కోర్సును ప్రారంభానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ తోపాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆసుపత్రుల నిర్మాణంలో ఆలస్యం

స్థాయిలో మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో పని చేయించడం కూడా రాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలపై మంత్రిసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు వికాస్ రాజ్, హరి చందన, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనత్ నగర్ లో ఆస్పత్రిని జూన్ 2వ తేదీన ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకున్నా.. పనులు ఎందుకు వేగంగా కొనసాగడం లేదని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఎప్పటి వరకు 5 సూపర్ స్పెషాలిటీ- ఆసుపత్రులు నిర్మాణం పూర్తి చేస్తారో టెక్నికల్ గా అంచనా వేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక, ఆసుపత్రులకు సంబంధించిన నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ, వైద్య పరికరాలను వైద్యారోగ్య శాఖ ఎస్టిమేట్ వేసుకోవాలని సూచించారు. ప్రతీవారం ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేయాలని మంత్రి కోమటిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

## సంక్షేమ హాస్టల్లలో మెరుగైన వసతులు

అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు అందించే కాస్మొటిక్ ఛార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్ లోకి జమ చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించడం వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక, గిరిజన, మైనారిటీ- వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ సోషల్ వెల్ఫేర్, మైనారిటీ- వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ హాస్టల్స్ సౌకర్యాలపై చర్చించారు. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడ నాణ్యమైన సరుకులు, విద్యార్థుల బెడ్ షీట్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్, బెడ్ షీట్లు, కార్పెట్స్, స్కూల్ బ్యాగ్స్ తదితర సామాగ్రి సమకూర్చుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇక వారికి అందించే సరుకుల క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని, అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులకు సూచించారు.

## ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం

ఇంతకాలం ఉన్న రాష్ట్రానికి రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అదే విధంగా రాష్ట్రంలో ఆదాయం పెరుగుదల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు.. ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టారు. లోటైన అధ్యయనంతోనే రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోందని స్పష్టం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఉన్నతాధికారులతో ఆదాయార్జన శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యంగా తెలిపారు. 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇక సాంకేతిక వినియోగం ద్వారా పన్ను ఎగవేతలకు చెక్ పెట్టవచ్చునని చెప్పారు. అంతర్జాతీయంగా ఎర్ర చందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పట్టుకున్న దుంగలను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చేందుకు ఆలోచన చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల అక్రమ మద్యాన్ని రాష్ట్రంలో నిరోధించాలన్నారు. అందుకు తగినట్లుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బంగారం కొనుగోళ్లు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని.. కానీ పన్ను ఆదాయం మాత్రం ఆ స్థాయిలో లేదని ఆయన పెదవి విరిచారు. ఈ విషయంపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కర్ణాటక, తమిళనాడులో జీఎస్టీ ఆదాయం పెరుగుతున్నా.. ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఆశించిన స్థాయిలో ఎందుకు పెరగడం లేదని ఆయన సందేహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లేని లోటు మన రాష్ట్రం పూడ్చుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు.

## కాశ్మీర్ విషయంలో భారత్ విధానం యధాతథం

ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేయించాల్సిన్నదే భారత్ విధానమని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కుండబద్దలు కొట్టారు. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అవసరం లేదని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక విధానంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తోందని రణధీర్ జైస్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణపై డీజీఎంవోల సమావేశంలో చర్చించామని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. మే 10వ తేదీన పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పారు. ఆ క్రమంలో ఈ భేటీలో కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదన పాకిస్తాన్ నుంచే వచ్చిందన్నారు. జమ్మూ కశ్మీర్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ జరుగుతోన్న సమయంలో భారత్, అమెరికా నాయకులు మాట్లాడారని గుర్తు చేశారు. అయితే ఇందులో వాణిజ్యపరమైన అంశాలపై చర్చ జరగలేదని చెప్పారు. ఇక సింధూ నది జలాల ఒప్పందంపై సస్పెన్షన్ కొనసాగుతుందన్నారు. కాశ్మీర్‌పై తమ విధానం మారలేదని తెలిపారు. కశ్మీర్ అంశంపై ద్వైపాక్షికంగా చర్చిస్తామని పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే చర్చలు ఉంటాయని ఆయన వివరించారు. టీఆర్‌ఎఫ్ లష్కరేతోయిబా అనుబంధ సంస్థ అని తెలిపారు. దీనిపై అంతర్జాతీయంగా నిషేధం విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని వదిలివేయడం అనేది మినహ ఉన్న విషయమని రణధీర్ జైస్వాల్ తెలిపారు.

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని.. ఈ జయ జయ ధ్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్‌మెయిల్‌ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. ప్రతి భారతీయుడు సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపూర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. ఈ ఉదయం నేను ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది.ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముమ్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు.

పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబ సభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు- ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయం తీసుకోడాని-కై-నా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. ఆదంపూర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసింది. భారత్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్తు.. సైబర్ వ్యవస్థలపై దాడి చేసి ధ్వంసం చేశామని చెప్పింది. ఇదంతా హేయమైన దుష్ప్రచారం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఎయిర్‌బేస్‌కు వెళ్లి మోదీ దాయాది తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టారు. అలాగే భద్రతాబలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ పర్యటన ద్వారా గట్టి సందేశం ఇచ్చారు.

## పదవీవిరమణ చేసిన జస్టిస్ట్ సంజీవ్ ఖన్నా

తదుపరి ఎటువంటి అధికారిక పదవులను చేపట్టనని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలను కుంటున్నానని చెప్పారు. మరోవైపు జస్టిస్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గతేడాది నవంబర్ 11 బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులైన జస్టిస్ ఖన్నా.. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. ఖన్నా పదవీవిరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మే 14న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నూతన సీజేఐతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీనియారిటీ పరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్ పేరును.. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 6 నెలలకుపైగా సీజేఐ పదవిలో కొనసాగనున్న జస్టిస్ గవాయ్.. నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు. డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే సేవలందించారు. దీంతో ఆయన పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ నేడు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా.. న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్‌ల రిగ్గింగ్‌ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే. కాగా తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్.. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారాలను అందచేస్తూ 6:1 మెజారిటీతో తీర్పును వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ ముఖ్యమైన తీర్పును వెలువరిస్తూ 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తినీ కూల్చరాదని ఆదేశిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు జారీచేసింది. అడవులు, వన్యప్రాణులు, చెట్ల పరిరక్షణకు సంబంధించిన అంశాలను విచారించే ధర్మాసనాలకు ఆయన సారథ్యం వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సెంట్రల్ వర్సిటీ భూములకు సంబంధించి కూడా ఆయన తీర్పును వెలువరించారు.

# పాలన అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోయడం కాదు

అందాల పోటీ-లు నిర్వహిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగులను సమకూర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ధాన్యాన్ని లారీలకు ఎక్కించే హమాలీలను సమకూర్చడంలో విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో, గొప్పగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమంటూ ధ్వజమెత్తన్నారు. గత అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మా ప్రభుత్వంలో తరుగు తీమయని చెప్పారని.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతు క్వింటాల్‌కు పది కిలోలు తరుగు తీస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో రైతులు ఆందోళన చేపట్టారన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వేసిన తూకం కంటే మిల్లర్లు తక్కువ ధాన్యాన్ని చూపుతూ రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించడానికి 3-4 రోజులు, మిల్లుల దగ్గర అన్‌లోడ్ చేయడానికి మరిన్ని రోజులు ఆలస్యం జరుగుతందని.. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేనద వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ట్రక్ షీట్ విధానం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు 10-10 రోజులు కొనుగోలు కేంద్రాల్లో వేచి చూడాల్సిన దుస్థితి ఎదురైందని.. ఈ ప్రభుత్వం మాటలు ఘనం చేతలు శూన్యం అంటూ విమర్శలు గుర్పించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల రోజుల తరబడి ఎండలో వేచి చూడడం వల్ల రైతులు పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. మే 13న మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో గగులోతు కిషన్ మృతి చెందారని, 15న జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జలపతి రెడ్డి చనిపోయారని తెలిపారు. ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు చెర్లపాలెంలో హనుమండ్ల ప్రేమలత మృతి, ఏప్రిల్ 22న నెల్లికుదురు మండలం మదనతుర్తిలో బిర్రు వెంకన్న, 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చింతకింది హనుమయ్య మృతి చెందారన్నారు. ధాన్యపు రాశులే సాక్షంగా.. కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ప్రభుత్వపు హత్యలేనన్నారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే హత్యలేనని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అందాల పోటీల మీద పోలీస్ కమాండ్ కంట్రోల్, జూబ్లీహిల్స్ ప్యాలస్‌లో రివ్యూలు పెడుతున్నారని.. సెక్రటేరియట్ ముఖం కూడా ముఖ్యమంత్రి చూడడం లేదని విమర్శించారు. రైతు సమస్యలపై ఎందుకు ముఖ్యమంత్రి రివ్యూ పెట్టడం లేదని ప్రశ్నించారు. ఫ్రబవరి నెలలో కట్టాల్సిన రైతు బీమా ప్రీమియం కట్టకపోవడం వల్ల చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు వివిధ జిల్లాల్లో ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా జటప్రోలులో అకాల వర్షానికి తడవడంతో రైతులు రాస్తారోకో చేశారని.. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామంలో సన్న వడ్ల కొనుగోలు లేకపోవడంతో రైతులు సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై ధర్నా చేశారని చెప్పారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల మార్కెట్ యార్డు వద్ద వర్షాలకు వేలాది బస్తాల వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిందని.. కాంటా జాప్యం, తరలింపు ఆలస్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఎర్వ చింతల్‌లో తూకంలో మోసాలపై పీఏసీఎస్ నిర్వాహకులను రైతులు ఘోరావ్ చేసి తక్షణ చర్యలకు డిమాండ్ చేశారని తెలిపారు. రైతులు ఎండకు ఎండి వానకు తడిచిపోతుంటే ఎందుకు ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని.. ప్యాలెస్‌లో అందాల పోటీ-లపై రివ్యూలా..ఝ మిమ్మల్ని నమ్మి ఓట్లు- వేసినా రైతులకు ఏమో మోసమా మండిపడ్డారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అంటూ నిలదీశారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలకు రాహుల్ గాంధీ సాక్షియమన్నారు. రాహుల్ గాంధీ వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీలపై ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయమని ముఖ్యమంత్రి అడిగితే ఢిల్లీకి వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లే వారిలా చూస్తున్నారని.. ఎవ్వడు నమ్మి అప్పు ఇవ్వట్లేదు అంటు-న్నారన్నారు. చివరికి పాకిస్తాన్‌ని నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షం మీద బురదజల్లబోయి నువ్వు తీసుకున్న గోతిలో నువ్వేపడ్డావు అంటూ మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటి-కై-నా ముఖ్యమంత్రి పాలనపై దృష్టి సారించి, రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని.. సీఎం అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చుడు కాదని.. తరుగు, తాలు పేరు మీద ఐదు నుండి పది కిలోలు తరుగు తీస్తున్నారు కాబట్టి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో భారీగా నష్టం

సైన్యం జరిపిన దాడిలో 11 మంది పాకిస్తాన్ సైనికులు మరణించగా, 78 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఆర్మీ మీడియా విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పహల్గామ్ దాడి తర్వాత ఉగ్రవాదులను నిర్మూలిస్తామని భారత్ ప్రతిజ్ఞ చేసి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణ జరిగింది. ఈ దాడిలో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. డాన్ వార్తాపత్రిక ప్రకారం, మరణించిన పాకిస్తాన్ ఆర్మీ సైనికులలో నాయక్ అబ్దుల్ రెహ్మాన్, లాన్స్ నాయక్ దిలావర్ ఖాన్, లాన్స్ నాయక్ ఇక్రముల్లా, నాయక్ వకార్ ఖలీద్, సిపాయి ముహమ్మద్ ఆదిల్ అక్బర్, సిపాయి నిసార్ ఉన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసింది. వైమానిక దాడిలో అనేక ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు, ఆపరేషన్ సింధూర్‌పై పాకిస్తాన్ ప్రభుత్వం, పాకిస్తాన రాజకీయ నేతలు తప్పుడు కథనాలను చెబుతూనే వస్తున్నారు. ఈ యుద్ధంలో పాకిస్తాన్ విజయం సాధించిందంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పాడు. మరోవైపు, పాక్ వ్యాప్తంగా విక్టరీ ర్యాలీలు తీస్తున్నారు. ఈ ర్యాలీల్లో మాజీ క్రికెటర్ ఆఫ్రిదితో పాటు- పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ ఓ వైపు క్లియర్‌గా శాటిలైట్ చిత్రాలతో పాకిస్తాన్‌కి జరిగిన నష్టాన్ని చూపిస్తుంటే, మరోవైపు తమకు ఏం కాలేదు, భారత్ తీవ్రంగా నష్టపోయిందని ఒక ఫేక్ ప్రచారాన్ని పాకిస్తాన్ చేస్తోంది. ఇదెలా ఉంటే, తాజాగా పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. భారత్ తమ 11 వైమానిక స్థావరాలపై క్షిపణి దాడి చేసినట్లు- అంగీకరించారు. భారతదేశంతో జరిగిన ఘర్షణల్లో పాకిస్తాన్ విమానాలు దెబ్బతిన్నట్లు- చెప్పాడు. పాకిస్తాన్ జెట్‌ని భారత్ కూల్చినట్లు స్పష్టమైన ఆధారాలతో వెల్లడించింది. అయితే, ఇషాక్ దార్ మాత్రం తమ జెట్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు- అంగీకరించారు. భారత పైలట్ ఎవరూ కూడా పాకిస్తాన్ వద్ద లేరని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాకిస్తాన్ లోని చాలా కీలమైన ఎయిర్ బేస్‌లపై భారత్ తీవ్రంగా విరుచుకుపడింది. శనివారం తెల్లవారుజామున రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో సహా సర్గోదా, రఫికీ, జకోబాబాద్, స్కర్దు వంటి ఎయిర్ బేస్‌లపై విరుకుపడింది. మొత్తంగా భారత్ పాక్‌కి చెందిన 11 వైమానిక స్థావరాలను దెబ్బతీసింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన తర్వాత 35-40 మంది పాకిస్తాన్ సైనిక సిబ్బంది మరణించినట్లు- భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

## సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

అయితే.. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ- ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్‌కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికెందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు- ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

# నవ దుర్గామాత శక్తిపీఠం బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

## అమ్మవారి దయవల్ల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి :ఎమ్మెల్యే పాయల శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు మే 13:**
ఆదిలాబాద్ లోని దుర్గా నగర్ లోని నవ దుర్గామాత శక్తిపీఠం బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి దయ వల్ల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే వేడుకున్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ పూజారి కిషన్ మహారాజ్ ను అభినందించారు

# చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

- గ్రూప్ ఫోటోలు దిగిన అందాల అతివలు
- లాడ్ బజార్‌లో షాపింగ్ చేసిన ముద్దుగుమ్మలు





**హైదరాబాద్,మే13( వెలుతురు):**
ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంతరి హైదరాబాద్ పాతబస్తీలో సందడి చేశారు. చార్మినార్ దగ్గర 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫోటో షూట్‌నిర్వహించారు. లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపింగ్ చేసారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక.. అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా వీరు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్ లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు- చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్ కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదీనా, చార్మినార్, శాలిబండ, వొల్గా జంక్షన్, ఖిల్వత్ రోడ్లను పూర్తిగా క్లోజ్ చేశారు. ఇవాళ రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

### తరతరాలుగా గూడులేని చెంచులకు

# 10 వేల ఇందిరమ్మ ఇండ్లు

ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు.

ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో ఆసిఫాబాద్ 3551, బోథ్ 695, ఖానాపూర్ 1802, సిర్పూర్ 311, అదిలాబాద్ 1430, బెల్లంపల్లి 326, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 105, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్ లో అచ్చంపేట్ 518, మహబూబ్‌నగర్ 153, పరిగి 138, తాండూర్ 184 మొత్తం 9,395 ఇండ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు.

ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లును మంజూరు చేస్తున్నామని, అయితే ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని అయితే ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు గాను 20 శాతం ఇండ్లను బఫర్ కింద పెట్టుకోవడం జరుగుతుందన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జిహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని , హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు.

గత ప్రభుత్వం కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి హైదరాబాద్‌లో ఉన్నపేదలకు కేటాయిస్తే వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టకొని పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్దతిలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

# అడవులలో అగ్ని ప్రమాదాలు, నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై రాష్ట్ర అటవీ, పర్యారణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత ఉన్నతాధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్ లో సమీక్ష



**హైదరాబాద్ వెలుతురు మే 13:**
రాష్ట్రంలోని వివిధ జోన్ల సీసీఎఫ్ లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలతో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ రాష్టవ్యాప్తంగా ఉన్న అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని అధికారులను ఆరా తీసిన మంత్రి సురేఖ ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని తెలుసుకున్న మంత్రి ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలున్నాయి... వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని అడిగిన మంత్రి సురేఖ. కాగా, మంత్రికి వివరించిన వైల్డ్ లైఫ్ బోర్డు ఉన్నతాధికారులు వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పన ఉందా అడిగిన మంత్రి. అయితే, ఈ వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు మంత్రికి వివరించిన అధికారులు నీటి గుంతల్లోకి నీటిని ప్రతిరోజూ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు తీసుకువస్తున్నట్టు వివరణ. నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్న మంత్రి సురేఖ. వన్యప్రాణులకు నీటి విషయంలో, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించద్దని అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారం అందజేయాలని సూచన. కాగా ఈ వీడియో కాన్ఫరెన్సు సమావేశంలో పీసీసీఎఫ్(హెఓఎఫ్ఎఫ్ డాక్టర్.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, పీసీసీఎఫ్( స్కీమ్స్) జవహర్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.




# రోడ్ల అనుసంధానంతో గ్రామ స్థాయిలో సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం

- సంగారెడ్డి నియోజకవర్గంలో 90 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు
- సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి జిల్లా వెలుతురు మే 13:**
సంగారెడ్డి నియోజక వర్గంలో రహదారుల అభివృద్ధి పనులకు రూ.90 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభం చేశారు. పోతిరెడ్డిపల్లి (ఎన్ హెచ్ 65 ) రోడ్డు నుంచి భూలక్ష్మమ్మ, కలివేముల రోడ్డు, సదాశివపేట మండలం ఆత్మకూరు నుండి సింగూరు వరకు ,కొండాపూర్ మండలంలోని మరే పల్లి నుచి సీత్రంకుంటకు గల వివిధ బీటీ రోడ్డు నిర్మాణాలకు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 15 గ్రామాల్లో రోడ్ల అనుసంధానంతో గ్రామస్థాయిలో సంపదను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బలమైన రవాణా వ్యవస్థ అవసరం అని ఇందులో భాగంగా గ్రామాల మధ్య రోడ్లను అనుసంధానించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు చేరువ అవడం, చిన్న పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడటం, యువతకు ఉపాధి అవకాశాలు కలగడం వంటి పలు మార్గాల్లో సంపద సృష్టి జరుగుతుందనీ పేర్కొన్నారు. రహదారులు పూర్తయితే గ్రామాల మధ్య రవాణా వేగ వంతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ గ్రామాల మధ్య సరైన రవాణా మౌలిక సదుపాయాలు ఉంటే గ్రామీణ ప్రజల జీవనోపాధిలో గణనీయమైన మార్పు వస్తుందనీ పేర్కొన్నారు. టి జి ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గం ఆదర్శంగా తయారు చేస్తామన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని, త్వరితగతిన ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సి డి సి రాంరెడ్డి, ఆర్డిఓ రవీందర్ రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం..

## కాల్పుల విరమణపై విమర్శలు తగవు !

యుద్ధాన్ని అర్థాంతరంగా అపారు. అమెరికా పెత్తనమేంటి..? ఎవరిని అడిగి కాల్పులు ఆపారు.. ఎందుకు పాక్‌పై పూర్తిస్థాయి దాడికి పూనుకోలేదు. పాక్ జుట్టు చేతికి అందే సమయంలో మోడీ లొంగిపోయారు. ఇలా రకరకాల ప్రశ్నలు ఇప్పుడు మోడీ లక్ష్యంగా సంధిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ వారు ఓ అడుగు ముందుకు వేసి ఆనాడు ఇందిరా గాంధీ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదని, నాటి ఆమె ప్రసంగాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నిజానికి మోడీ అమెరికా లేదా,పాక్‌కు తలొగ్గారని ఎవరైనా అనుకుంటే భ్రమే అవుతుంది. ఎందుకంటే ఆయన ప్రసంగం విన్నవారు ఈ భ్రమల నుంచి బయటపడాలి. మోడీ ఎక్కడా రాజీపడలేదు. అలాగే పాకిస్థాన్‌కు గతంలో కన్నా గట్టి దెబ్బ కొట్టారు. అంతే కాకుండా కాచుకో అని హెచ్చరించారు. తోక ఝాడిస్తే పాక్ మసవుతుందని నిరూపించారు. ఉగ్రవాదులను ఉసిగొల్పితే నేరుగా పాక్‌పై దాడి చేస్తామని హెచ్చరించారు. ఇక ఇందిర విషయానికి వస్తే..1971లో బంగ్లాదేశ్ విముక్తితో బాగుపడ్డది బంగ్లా తప్ప భారత్ కాదు. కొత్తగా దేశం అవతరించింది. అదికూడా మనకు పక్కలో బల్లెంలా తయారయ్యిందని ఇటీవలి ఘటనలు రుజువు చేస్తున్నాయి. అక్కడా హిందువులను ఊచకోత కోశారు. కనీస కృతజ్ఞత లేకుండా బంగ్లాదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. ఇకపోతే ఆనాటి యుద్ధం లో 93వేల మంది పాక్ సైనికులు పట్టుబడితే ఉదారంగా వదిలేశారు. ఆనాడే పట్టుబట్టి పివోకెను స్వాధీన పరచుకునే అవకాశం ఉన్నా వదిలిపెట్టారు. ఇదీ ఇందిరాగాంధీ నిర్వాకం. ఆనాడు గట్టిగా బుద్ది చెబితే ఇప్పుడు భారత్‌కు ఉగ్రవాదుల సమస్యలు వచ్చేవి కావు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకుంటే మంచింది. అన్నింటికన్నా ముఖ్య విషయమేంటంటే ఆపరేషన్ సింధూర్ కేవలం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు మాత్రమే ఉద్దేశించినది. ఈ క్రమంలో పాక్ కాల్పులకు తెగబడగా మన సైనిక దళాలు మరో అడుగు ముందుకు వేసి పాక్‌ను చావుదెబ్బ కొట్టాయి. మరో వందేళ్లయినా కోలకుకోకుండా సర్వనాశనం చేశాయి. పహల్గాంలో ఉగ్రమూకలు కర్కశంగా దాడి చేసి 26 మందిని హతమార్చిన తర్వాత రగిలిపోయిన ప్రధాని పాకిస్థాన్‌పై దాడికి త్రివిధ దళాలను సిద్ధంచేసి ప్రతిదాడులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి మోడీ తీసుకున్న నిర్ణయాలను ప్రపంచంతో పాటు దేశం కూడా శ్లాఘిస్తోంది. ఇంటా బయటా ఆయన ప్రతిష్ఠ అమాంతంగా పెరిగింది. పహల్గాంలో యాత్రికుల మతం తెలుసుకొని మరీ పురుషులను మాత్రమే చంపి మన మహిళల పసుపు కుంకుమలను ఉగ్రవాదులు చెరిపేయడంతో దేశ ప్రజలందరిలోనూ ప్రతీకారేచ్ఛ రగిలిపోయింది. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాల్సిందేనని దేశ ప్రజలంతా నినదించారు. దీంతో ఇదే అదనుగా భావించిన ప్రధానమంత్రి... పాక్‌పై ప్రారంభించిన ప్రతిదాడులకు 'ఆపరేషన్ సిందూర్' అని వ్యూహాత్మకంగా నామకరణం చేశారు. ఏ మహిళల నుదుటిపై సిందూరం తుడిచివేయబడిందో అదే సిందూరం పేరిట ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసే బాధ్యతను ఇద్దరు మహిళా సైనికాధికారులకు అప్పగించారు. ప్రధాని మోదీ చతురతకు ఇది నిదర్శనంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో లక్ష్యం నెరవేరింది. పాక్ గడ్డపై 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. తరవాత పాక్ దీనికి కట్టుబడి అభినందించకుండా ఉగ్రవాదులకు అండగా నిలిచింది. అకారణంగా భారత్‌పై కాల్పులకు తెగబడింది. దీంతో భారత్ ధీటుగా సమాధానం ఇవ్వండంతో చివరకు దానికి చావుదెబ్బ తప్పలేదు. ఎయిర్‌బేస్‌లు దెబ్బతిన్నాయి. అణుస్థావరంపై దాడి జరిగింది. చివరకు కోలుకోలేని స్థితిలో కాళ్లబేరానికి వచ్చింది. మనం నేరుగా చెబితే ఒప్పుకోమన్న భయంతో అమెరికాను వేడుకుంది. అమెరికా ద్వారా పాకిస్థాన్ రాయబారాలు నడిపి కాల్పుల విరమణకు ఒప్పించింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి అనూహ్య రీతిలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఇది ఒకరకంగా శుభ పరిణామంగా చూడాలి. ఎందుకంటే ఆపరేషన్ సింధూర్ ముగియలేదని మోడీ తేల్చారు. సైన్యం కూడా తేల్చింది. ఏమాత్రం అల్లరి జరిగినా ఈసారి దాడికి రెడీగా ఉంటామని, సింధూర్ ముగియలేదని తేల్చి చెప్పాం. ఉగ్రవాదాన్ని, చర్చలను ఒకేగాటిన కట్టలేమని చెప్పారు. నీళ్లను రక్తాన్ని కలిపి పారించలేమన్నారు. పివోకె, ఉగ్రవాదంపైనే తదుపరి చర్చలని కూడా మోడీ తేల్చారు. ఇవి గ్రహించకుండా పాక్పై కాల్పుల విరమణ గురించి విమర్శలు చేసేవారు గతాన్ని, ప్రస్తుతాన్ని గమనించి మాట్లాడితే మంచిది. ఇకపోతే పాక్ ఉగ్రవాదులు మత ప్రాతిపదికన మారణహోమం సృష్టించడం ద్వారా మన దేశంలో హిందువులను సంఘటితం చేశారు. ఫలితంగా ప్రధాని మోదీ అత్యంత శక్తిమంతమైన నేతగా అవతరించారు. మాకు మోదీ ఉన్నారన్న ధీమాలో ఇప్పుడు దేశ ప్రజలు ఉన్నారు. పాకిస్థాన్ గడ్డపై తిష్ఠవేసిన దాదాపు వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టగలగడం మన దేశం సాధించిన విజయం. గతంలో పాకిస్థాన్‌పై మన దేశం రెండు పర్యాయాలు యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ రెండు సందర్భాలలోనూ భారత దేశానిదే పైచేయి అయింది. కానీ ఇప్పుడు ఉన్నంతగా ఆనాడు పరిస్థితులు అనుకూలించలేదు. ఆనాడే పివోకేను ఇస్తేనే సైనికులను వదులుతామని ఇందిర చెప్పి వుంటే సమస్య ఇంతదాకా వచ్చేది కాదు. భారత్‌తో నేరుగా తలపడి నెగ్గే పరిస్థితి లేనందున ఉగ్ర మూకల ద్వారా మన దేశంలో అలజడులు సృష్టించే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోంది. ఈ క్రమంలో పాక్‌లో తిష్ఠ వేసిన ఉగ్రవాదులు మరింత శక్తిమంతులుగా మారారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ ద్వారా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా పాక్ మిలటరీకి, ఉగ్రవాద సంస్థలకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. తాము శత్రు దేశంగా పరిగణించే భారత్‌ను ఏదో చేయాలన్న దుగ్ధతో పాకిస్థాన్ తన తల కొరివిని తానే పెట్టుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పుడు పహల్గామ్ దాడి తరవాత ఇక పాక్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి దూకుడుగా భారత్‌పై దాడికి దిగే ఛాన్స్ తక్కువ. భారత్ అమ్ముల పొది ఏమిటో పాక్‌కు తెలిసి వచ్చింది. మళ్లీ ఇలాంటి ప్రయత్నం చేస్తే పాక్ ముక్కచెక్కలు కాక తప్పదు. అందుకు మోడీ వ్యూహంతోనే ఉంటారు. భారత రక్షణ దళాలు కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సిద్దంగా ఉన్నాయి. ఇక్కడ అమెరికాకు తలొగ్గి సిందూర్‌ను నిలిపివేశారన్న విమర్శల నుంచి బయపటడి దేశం మొత్తంగా ఒక్కటే అన్న నినాదంతో ముందుకు సాగాల్సి ఉంది.

# కుడితిలో పడ్డ ఎలుకలా పాక్ పరిస్థితి

- సైన్యానికి, ఉగ్రవాదులకు తలొగ్గే దుస్థితి
- బలూచీ ఉద్యమం మరింత ఉధృతంతో భయం

న్యూఢిల్లీ,మే13( వెలుతురు):
పాక్ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. భారత్ ప్రతిదాడితో ఇక ముందు సాహసం చేసే పరిస్థితి లేకుండా చేసుకుంది. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, ఉసిగొల్పడం ద్వారా భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకపోతే పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరని గతంలో అనేకమార్లు రుజువయ్యింది. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టారు. అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు. సైన్యాన్ని ఉగ్రవాదులు తమ అదుపులో పెట్టుకోగా, ప్రభుత్వాలను సైన్యం తన అదుపులో పెట్టుకుంటోంది. భారత్ ఉగ్రవాదులను మట్టుపెడితే వారికి పాక్ సైన్యం నివాళి అర్పించిందంటేనే ఎంతగా వారు దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఉగ్రవాదులను కట్టడి చేయాలనుకునే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా పాకిస్థాన్ అన్ని విధాలుగా నష్టపోతోంది. ఆ దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉంది. బయటి నుంచి ఆర్థిక సాయం అందని పక్షంలో పాక్ కుప్పకూలిపోతుంది. ఆర్థిక సంక్షోభం ఒకవైపు – అంతర్గత పోరు మరోవైపు ఆ దేశాన్ని కుంగదీస్తున్నప్పటికీ ఉగ్రవాదులు మతపరమైన ఉన్మాదంతో ఊగిపోతున్నారు. మరోవైపు







పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం భూ భాగమైన బలూచిస్థాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడాలని కోరుకుంటోంది. ఇందుకోసం బలూచీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఈ తరుణంలో భారత్‌తో సయోధ్యకుమించిన మార్గం లేదు. అందుకే కాల్పుల విరమణకు పాక్ ముందుకు వచ్చింది. ఇందులో పాక్ రాయబేరమే ఎక్కువ. దానికి అంతర్జాతీయ మద్దతు కావాలి. రుణం కావాలి. అందుకే ట్రంప్ కాళ్లావేళ్లా పడి రుణం కోసం కాల్పుల విరమణకు సిద్దపడింది. అయితే ఇది అక్కడి ఉగ్రవాదులకు, సైన్యానికి రుచించకున్నా తప్పని పరిస్థితి. మన దేశం 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మనకు 1947లో స్వాతంత్యం÷–ర వచ్చిన తర్వాత రెండుసార్లు పాకిస్థాన్‌తో, ఒకసారి చైనాతో యుద్ధం చేయాల్సి వచ్చింది. 1971 తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటం, స్వల్ప స్థాయిలో దాడులు చేసుకోవడం మినహా పూర్తి యుద్ధం జరగలేదు. 1971లో జరిగిన యుద్ధం గురించి ఇప్పుడు అరవై ఏళ్ల వయసు ఉన్న వారికి కూడా పూర్తిగా తెలియదు. అయితే ఆనాడు బంగ్లాను కోల్పోయిన పాక్ ఇప్ఉడు మొండగా ముందకు వెళితే బలూచీని కూడా కోల్పోవడం ఖాయం. అందుకే బలూచీని కాపాడుకునే క్రమంలో కాల్పులకు దూరంగా ఉండడానికి కూడా ఓ కారణంగా చూడాలి.


# చిత్తూరులో అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర

- పూజలుచేసి ప్రారంభించిన ఎమ్మెల్యే దంపతులు

చిత్తూరు,మే13( వెలుతురు):
నడివీధి గంగమ్మ జాతర వేడుకలు మంగళవారం ఉదయం చిత్తూరు నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు కుటుంబం తొలి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి.. వేడుకలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దంపతులు సీకే బాబు దంపతులతో కలిసి తొలి



పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతర వేడుకల్లో మొక్కులు తీర్చుకునేందుకు భక్తజనం పోటెత్తారు. జాతర మంగళ, బుధవారం రెండు రోజులపాటు– కొనసాగనుంది. స్థానిక వాసులే కాకుండా సమీప పొరుగు రాష్ట్రలైన తమిళనాడు, కర్ణాటక నుంచి వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిత్తూరు నగరంలోని బజారువీధిలో మంగళ, బుధవారాల్లో నిర్వహించే నడివీధి గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం చేసినట్లు– ధర్మకర్తలు సీకే బాబు, హేమంత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం వేకువ జాము నాలుగు గంటలకు వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు దంపతులు అమ్మవారికి తొలిపూజ చేసి, అంబలి నైవేద్యం సమర్పించారు. రాత్రి మహా కుంభనైవేద్యం సమర్పించి, బుధవారం సాయంత్రం అమ్మవారిని జలప్రవేశం చేస్తారు. పోలీసులు, నగరపాలక, వైద్య సిబ్బంది సహకారంతో భద్రత, పారిశుధ్య, వైద్యసాయంపై ఏర్పాట్లు– చేశారు. జాతరకు వచ్చే భక్తులకు పలుచోట్ల దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు– చేశారు. చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో రెండు లక్షల మంది



భక్తులకు మజ్జిగ, తాగునీరు, పళ్లరసాలు వితరణకు ఏర్పాట్లు– చేశారు.

(ఆధ్యాత్మికం )

# ముక్తిమార్గం.. చార్‌ధామ్ యాత్ర

నైనిటాల్,మే13( వెలుతురు):
మనదేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో గల గంగోత్రి, యమునోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్‌లను కలిపి చార్ ధామ్ అని పిలుస్తారు. ఈ ఏడాది అక్షయ తృతీయ రోజున చార్‌ధామ్ యాత్ర మొదలైంది. లక్షలాదిమంది హిందువులు ఈ యాత్రలో పాల్గొందామనుకునే సమయంలో పహల్గామ్ దాడి జరిగింది. అయితే కాల్పుల విరమణ జరగడంతో ఇప్పుడు చార్‌ధామ్ యాత్రకు నమ్మకం ఏర్పాడింది. ప్రభుత్వం కూడా గతం కన్నా మిన్నగా భద్రతా ఏర్పాట్లను చేసింది. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జననమరణ చక్రభ్రమణం నుంచి విముక్తి దొరకుతుందని నమ్మకం. కేదార్ నాథ్ జ్యోతిర్లింగ దర్శనం తర్వాత స్వామివారి అభిషేక జలం స్వీకరించిన భక్తులకు తప్పక మోక్షం సంప్రాప్తిస్తుందని చెప్తారు. బద్రీనాథ్ దామ్ సందర్శన చేసిన వారు తిరిగి గర్భప్రవేశం చెయ్యడని, ముక్తిని పొందుతాడని శాస్త్రం చెబుతోంది. చార్‌ధామ్ ప్రయాణం వెనుకున్న కారణాలు, ఈ యాత్ర ప్రాశస్త్యం కారణంగా ప్రజలు చార్‌ధామ్ యాత్రకు ఆసక్తి చూపుతారు. ఈ యాత్ర చేయడం వల్ల జీవితానికి ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలు లభిస్తాయని ప్రశస్తి. పరమాత్ముడితో అనుసంధానం చేసే యాత్రే చార్‌ధామ్ యాత్ర. తీర్థయాత్ర చేసే సంకల్పం చేశారంటేనే ఎక్కడో సాత్వికత ఉందని అర్థం. చార్ ధామ్ ఒక సుదీర్ఘ




తీర్థయాత్ర. ఈ యాత్ర ఆసాంతం మనసు ఒక పవిత్ర భావనతో ఉంటుంది. ఫలితంగా సానుకూల శక్తులను ఆకర్షించగలుగుతారు. ఈ యాత్ర జీవిత లక్ష్యాలను అర్థం చేసుకోవడంలో మీకు ఎంతో తొడ్పడుతుంది. నిజానికి ఈ యాత్ర జీవన యానానికి ఒక మార్గదర్శనం వంటిది. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు ప్రక్షాళన అవుతాయని విశ్వాసం. తెలిసీ తెలియక చేసిన అన్ని తప్పులకు ఈ యాత్ర ద్వారా మన్నింపు దొరుకుతుందని నమ్మకం. చార్ ధామ్ యాత్ర చేసి వచ్చిన వారు మరింత జాగరూకతతో ఇక జీవితంలో పాపాలు చెయ్యకుండా జీవించాల్సి ఉంటుందని నమ్ముతారు. చార్‌ధామ్ లో కేవలం దైవదర్శనం మాత్రమే కాదు, ప్రకృతిలో లీనమైన భగవద్దర్శనం జరుగుతుంది. గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బద్రీనాథ్‌లలోని ప్రకృతి అందాలు ఒక అద్భుతమైన అనుభూతి ఇస్తుంది. చార్‌ధామ్ యాత్ర శరీరానికి అరోగ్యాన్ని ప్రసాధిస్తుంది. ఆయుశ్శును పెంచుతుంది. చార్‌ధామ్ యాత్ర చాలా కష్టాలకోర్చి చెయ్యవలసిన యాత్ర. ఇక్కడి వాతావరణం చాలా స్వచ్ఛంగా ఉంటుంది. పర్యావరణం కాలుష్యరహితంగా ఉంటుంది. భక్తి మనసును శుద్ధి చేస్తే అక్కడి పర్యావరణం నీళ్లు శరీరాన్ని శుద్ధి చేస్తుంది.హిందూ సంస్కృతిపై అవగాహన కోసం చాలా మంది విదేశీయులు ఈ యాత్ర కోసం మనదేశానికి వస్తుంటారు. అక్కడి ప్రజల జీవన విధానం, వారు ధరించే దుస్తులు, ఇతర నమ్మకాల గురించి తెలుసుకుంటారు. అక్కడి సమాజానికి దగ్గరగా మసలడం ద్వారా, సంస్కృతిని ఆకళింపు చేసుకోవడం ద్వారా సహజంగానే ప్రవర్తనలో పరివర్తనను స్వయంగా గుర్తించవచ్చు. ఈ పరివర్తన మన జీవితంలో గొప్ప మార్పుకు కారణం అవుతుంది.

# కాశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాదుల ఏరివేత

- ముగ్గురు ఉగ్రవాలను మట్టుపెట్టిన బలగాలు

శ్రీనగర్,మే13( వెలుతురు):
పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత సైన్యం ఉగ్రవాదులను మట్టుపెట్టే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సింధూర్ నిర్వహించి.. పాకిస్థాన్, పిఒకెలలోని ఉగ్రవా స్థావరాలపై భారత్ దాడి చేసింది. మరోవైపు భద్రతా బలగాలు భారత్‌లో తలదాచుకున్న ఉగ్రవాదలను అంతం చేస్తున్నారు. తాజాగా జమ్ముకశ్మీర్‌లో



భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. షోపియాన్ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఘటనలో మరో ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. తొలుత కుల్గాం ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. తర్వాత అవి షోపియాన్‌కు విస్తరించాయి. ఆ ఉగ్రవాదులు లష్కరే తోయిబా గ్రూప్‌నకు చెందినవారిగా తెలుస్తోంది.

ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. అవి అలా పెరుగుతు పోషియాన్ వరకూ విస్తరించాయి. ఉగ్రవాదలను హతం చేసేందుకు ఆర్మీ, పారామిలిటరీ బలగాలు కొన్ని గంటలుగా కృషి చేసాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తొలుత కుల్గాం

## హనుమాన్ నగర్ కాలనీవాసుల సమావేశం



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 13 :**
మున్సిపాలిటీ పరిధి స్థానిక హనుమాన్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రోజు సమావేశము జరిపారు మే నెల 22వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా చేయడానికి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమావేశమై చర్చించడం జరిగినది ఈ కార్యక్రమంలో భీమిడి మోహన్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్, గుప్తా వెంకటేశం, గోవర్ధన చారి, నర్సింహాచారి, నాను నాయక్, వెంకట్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎల్లయ్య లింగా చారి, తడక అమర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, శంకర్ నాయక్, పబ్బు రవీందర్, మెట్టు రామచంద్రారెడ్డి, రాజు, మధు చారి, భీమిడి రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ మూసివేత నిర్ణయానికి నిరసనగా....

- నేడు వేములవాడ బంద్
- స్వచ్ఛందంగా బంద్ పాటించాలని రాజన్న ఆలయ రక్షక కమిటీ పిలుపు
- ఆలయం వద్దనున్న దర్గాను తొలగించాలని డిమాండ్
- వేములవాడ బంద్ కు అఖిలపక్ష నేతల మద్దతు

**వేములవాడ వెలుతురు మే 13:**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పేరుతో జూన్ 15 నుండి రాజన్న ఆలయాన్ని మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేడు (బుధవారం) వేములవాడ పట్టణ బంద్ కు రాజన్న ఆలయ రక్షక కమిటీ పిలుపునిచ్చింది. స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ తమ దుకాణాలను మూసివేయాలని కోరింది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీసహా అన్ని పార్టీల నాయకులతో కలిసి 'రాజన్న ఆలయ రక్షక కమిటీ'ని ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రాబోయే రెండు సంవత్సరాలపాటు ఆలయాన్ని మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రాజన్న ఆలయ రక్షక కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీ చైర్మన్ ప్రతాప రామక్రిష్ణ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో 2 ఏళ్లపాటు రాజన్న ఆలయాన్ని మూసివేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. వేములవాడ రాజన్న అభివృద్ధి పేరుతో పరివార్ దేవతామూర్తుల (హిందూ) విగ్రహాలను తొలగించడాన్ని వ్యతిరేకించారు. రాజన్న ఆలయం వద్దనున్న దర్గాను తొలగించాలను రాజన్న భక్తులంతా ముక్త కంఠంతో కోరుతున్నా పట్టించుకోని అధికారులు ఆలయాన్ని మూసివేయాలనుకోవడం విడ్డూరమన్నారు. సర్కార్ నిర్ణయాన్ని నిరసిస్తూ రేపు చేపట్టబోయే వేములవాడ బంద్ కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యాపారులంతా స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేయాలని పిలుపునిచ్చారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కలసిన భీమ లక్ష్మణ్ ముదిరాజ్



**హైదరాబాద్ వెలుతురు మే 13:**
మంగళవారం రోజున కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమా లక్ష్మణ్ ముదిరాజ్ గౌరవ మంత్రివర్యులు మాన్యశ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి పార్టీ మరియు ప్రభుత్వంలో మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరంపై సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకంగా రాబోయే కార్పొరేషన్లలో ముదిరాజ్ వర్గానికి పదవులు కల్పించేందుకు, వర్గ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక న్యాయం జరిగేలా చూడాలని గౌరవ మంత్రివర్యులకు వినమ్ర విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై మంత్రి గారు ఎంతో సానుకూలంగా స్పందించారు. ముదిరాజ్ సమాజానికి ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్గా, రాబోయే కార్పొరేషన్ చైర్మన్ పదవిలో భీమా లక్ష్మణ్ ముదిరాజ్ గారికి అవకాశం కల్పించనున్నట్లు గౌరవ మంత్రి గారు హామీ ఇచ్చారు. ఈ హామీతో ముదిరాజ్ వర్గంలో కొత్త ఉత్సాహం, ఆశాభావం నెలకొంది.

## 36 లక్షలతో కొత్త బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఏమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 13:**
మంగళవారం రోజున హిమాయత్నగర్ డివిజన్ లో ని వీధి నెంబర్. 01 లో 36 లక్షలతో కొత్త బీటీ రోడ్డు పనులను ఖైరతబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ గారు మరియు హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిమాయత్ నగర్ డివిజన్ లో ఉన్న అన్ని వీధులలో నూతన స్ట్రీట్ లో వేసి నాక్ నగర్ వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత వారిది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ పవన్ వర్క్ ఇన్స్పెక్టర్ రాము, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్,బాబు సార్ యతిరాజ్, అశోక్, ప్రభాకర్, రాజేందర్, గ్యని, శ్రీనాథ్, జాకి, ప్రియ రాజ్ సంజీవరెడ్డి రమేష్ జస్వాల్, అనీష్, జ్యోతి రెడ్డి, బిండియా, కళ, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నేల 20 న సార్వత్రిక సమ్మెకు మద్దత్తుగా

# గ్రామీణ బంద్ ను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, కొయ్యడ సృజన్ కుమార్




**కరీంనగర్ వెలుతురు మే 13:**
దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ, రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నేల 20 తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దత్తుగా గ్రామాల్లో వ్యవసాయ కూలీలు గ్రామీణ బంద్ నిర్వహించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు మంగళవారం రోజున స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ చాయ్ వాలా పేరుతో దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా నిర్లక్ష్యం చేస్తూ, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ, హక్కులను హరిస్తున్నారని,44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లుగా తెచ్చారని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను అదాని, అంబాని లకు కట్టబేడుతున్నారని ఆరోపించారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పెద బడుగు బలహీన వర్గాలకు చేతి నిండా పని కల్పించాలనే లక్ష్యంతో యుపిఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు చేసి కోట్లాది మంది కూలీలకు పని కల్పిస్తుంటే నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్లో నిధుల కేటాయింపులో కోత విధిస్తున్నారని,పని రోజులు తగ్గిస్తున్నారని, పని ప్రదేశాల్లో పనికి ముందు పనికి తర్వాత కూలీలను ఫోటో అప్లోడ్ చేసే విదానాన్ని తెచ్చారని అన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజు వారి కూలీ 600 చెల్లించాలని, వేసవి భృతి యధావిధిగా కొనసాగించాలని,పని ప్రదేశాల్లో కొలుతలు లేకుండా పని కల్పించి బిల్లులు చెల్లించాలని,ఆధార్, జాబ్ కార్డు, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేయడం ఆపాలనే, ఉపాధి కూలీలకు ఇన్స్యూరెన్స్ అవకాశం కల్పించాలని, ఉపాధి హామీ పథకం రద్దు చేసే కుట్రలను మానుకోవాలని కోరుతూ 20 వ తేదీన కూలీలు ఉపాధి హామీ పనులను బంద్ చేసి దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బి కె యం యు జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్, ఏ ఐ ఏ డబ్లు యు జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ నాయకులు నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూరం విజయోత్సవ ర్యాలీ



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:**
మండలంలో మండల అధ్యక్షుడు బంద మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ, దేశంలో ప్రహల్గాం లో జరిగినటువంటి ఉగ్రవాద చర్య ఏదైతే జరిగిందో, భారత దేశ అశ్విత్వాన్ని కులదైసే ప్రయత్నం ఏదైతే చేశారు. దానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడి జరిపి విజయవంతంగా తిరిగి రావడం జరిగింది. అలాగే దేశంలో ఎలాంటి ఉగ్రవాద చర్యలు జరిపిన వారిని నామరూపాలు లేకుండా చేసే బాధ్యత నరేంద్ర మోడీ తీసుకున్నారు. అని చెప్పడం జరిగింది. మరోసారి ఎలాంటి కవ్వింపు చర్యలు చేసిన పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే ఉండదు. అని చెప్పేసి వారికి గట్టి హెచ్చరికలు చేయడం జరిగింది. ఆపరేషన్ సింధూరం అనేది ఇంతటితో అయిపోలేదు ఇలాంటి పిరికిపంద చర్యలు ఏదైనా ఉగ్రవాదులు చేస్తే దాన్ని దీటుగా ఎదుర్కొని అంతం చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, సీనియర్ నాయకులు కట్ట యాదయ్య, వెంకటేష్, బట్టి రమేష్, బెల్లి లింగస్వామి, కంభంపాటి శివరంజన్, రేపాక లింగస్వామి, మల్లికార్జున, గన్నేబోయిన మధు, పెంద్యం శీను, రమేష్, స్వామి, మద్దెలపూరి ఐలయ్య, గజ్జల రాము, బద్దుల మల్లేష్, బండమీది సుధాకర్, చిల్ల నరేష్, జల లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, పుట్టబోతుల వెంకటేష్, రాపోలు నరేష్, బొడ్డు పెల్లి సైదులు, కంబాలపల్లి రాజశేఖర్, గోదాసు సునీల్ చారి, ఏ నూతల సురేష్, మోరే రాజయ్య, భాష కార్ల నరేందర్ రెడ్డి, నోముల శీను, దావునూరి అజయ్, గురజాల నిరంజన్ రెడ్డి, జాల చంద్రయ్య, ఆకిటి వేణు, శ్రీ మల్లేష్, కన్యబోయిన నరేష్, అతన అక్కెనపల్లి సైదులు, పిండి సత్యనారాయణ, బందెల సంజీవ, పొలాస ఉపేంద్ర, చారి, మచ్చ గిరి, సంతోష్ ,రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం రోజున ఖమ్మం ట్రంక్ రోడ్ లోని నూతనంగా ప్రారంభించిన మిస్టర్ ఇరానీ కేఫ్ కి ముఖ్యఅతిథిగా విచ్చేసి కేఫ్ ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్, ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.
ఖమ్మం పట్టణం వెలుతురు మే 13:

## ఈటెల రాజేందర్ పై అహంకారమైన వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్



**మునుగోడు వెలుతురు మే13:**
మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ పై అహంకారమైన వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పచ్చ లేని మనిషిగా పేరు పొందిన నాయకుడిగా ఉన్న గౌరవ ఈటెల రాజేందర్ గారిని నోటికొచ్చినట్టు మాట్లాడితే ఎవరు ఊకోరాన్ని ఈటెల రాజేందర్ బిసి నాయకుడు అయినందునే అగ్రవర్ణాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. ఎంపి ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేక నోటికి వచ్చినట్టు మాట్లాడితే ఏ బీసీ నాయకుడు గాని బిజెపి పార్టీ నాయకులు ఎవరు అని అన్నారు వెంటనే క్షమాపణ చెప్పాలని లేని ఏడల పి.సి.సి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు

## నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను

- కెసిఆర్ ఆదేశాలు తు.చ తప్పకుండా పాటిస్తా
- కెటిఆర్ను పార్టీ అధ్యక్షుడిని చేసినా అనుసరిస్తా
- పార్టీ మారడం అన్న ప్రచారంలో నిజం లేదు: హరీష్

**హైదరాబాద్,మే13( వెలుతురు):**




భారాసలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్కు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ తర్వాత కేటీఆర్కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా. గతంలో కూడా ఈ అంశంపై చాలాసార్లు స్పష్టత ఇచ్చా. కార్యకర్తగా కేసీఆర్, పార్టీ ఆదేశాలను పూర్తిగా పాటిస్తా. కేసీఆర్ నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటానని హరీశ్రావు స్పష్టం చేశారు.కార్యకర్తగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు–సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హరీష్ రావు మాట్లాడుతూ.. కెసిఆర్ మా అధ్యక్షుడు.. ఆయన చెప్పింది నేను తూ.చా. తప్పకుండా పాటిస్తానని అన్నారు. ఈ మాట తాను ఇప్పటికే చాలా సార్లు చెప్పానని.. ఎన్ని సార్లు అడిగిన ఇదే చెప్తానన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కెటిఆర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే.. తప్పకుండా స్వాగతిస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కెసిఆర్ నిర్ణయాన్ని ఎప్పుడు శిరసావహిస్తానని హరీష్ రావు క్లారిటీ– ఇచ్చారు.

## అందాల పోటీ మీద ఉన్న శ్రద్ధ గ్రామాల అభివృద్ధి పైన శ్రద్ధ లేని కాంగ్రెస్ సర్కార్?

### - సుర్వి యాదయ్య గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 13:**



తెలంగాణ రాష్ట్రంలో లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గ్రామాలు అభివృద్ధి నిధులు ఇవ్వకపోవడం గ్రామాలు పై దృష్టి పెట్టపోవడం అభివృద్ధి చేయకపోవడం మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన గాలికి వదిలేసి ఉన్నాడు అన్నారు, తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ అందాల ప్రపంచ సుందరిలతో చుట్టూ తిరుగుతున్నాడు స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించడంలో శ్రద్ధ చూపకపోవడం అందాల పోటీల కోసం రివ్యూలు చేస్తున్నాడు, అందాల భామలకు కుక్కలు కనబడకుండా కుక్కలను ఎత్తుకు పోయి చంపుతున్నారు.. కాన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పాల్పడుతూ అప్పుల బాధలతో చనిపోయిన సర్పంచుల కుటుంబాల కోసం రివ్యూ చేయడానికి కనీస సమయం లేదు వేలాది మంది పోలీసులను, ప్రభుత్వ అధికారులను నియమించి అందాల ఇబ్బంది కలగకుండా చూస్తున్నాడు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అలా ఇబ్బందులు పడుతూ ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

## సిపిఐ లో పలువురి చేరిక

**కూనమనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రజల వాణిని వినిపించే ప్రజా గొంతుకైనందున ఆకర్షితులై సిపిఐ పార్టీలో చేరిక..**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:**
మండలం బోగారం గ్రామానికి చెందిన తెలుసూరి మల్లేశం, కూనూరు కబీర్ దాస్ నీ, సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ చేతుల మీదుగా, సిపిఐ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో నిత్యం ప్రజల పక్షాన ప్రజా గొంతుకై నినదిస్తున్న కూనమనేని సాంబశివరావు మాటలకు ఆకర్షితులై పార్టీలో పలువురు చేరుతున్నారని భవిష్యత్తులో, పార్టీఅభివృద్ధి కొరకు పాటుపడాలని నిత్యం పేదల పక్షాన ఎర్రజెండా ప్రజా సమస్యలపై పోరాడుతుందని నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు భారత కమ్యూనిస్టు పార్టీచేస్తుందని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్,భగవంత, రచ్చ యాదగిరి, కళ్లెం యాదగిరి, ఊట్కూరి కృష్ణ, పర్సా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:**
మండలంలోని వెల్లంకి గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మారమ్మ అమ్మవారిని దర్శించుకున్న. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.

# భారత ప్రభుత్వ నీతి ఇదే మన సనాతన ధర్మం!!

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:**
పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను మట్టి కరి పిస్తూ చల్లని కాశ్మీర్ మంచు కొండల నుండి రాజస్థాన్ థార్ ఎడారోల దాకా పాకిస్తాన్ ఉగ్రవాద దాడులను సమర్ధంగా తిప్పి కొట్టిన భారత సేనలు ప్రపంచానికి భారత్ సత్త చాటి అదే సమయంలో భారత ప్రభుత్వం ప్రజలు శాంతికాముకులని దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని యుద్ధాన్ని ఆపివేయడం మన యొక్క నీతి దేశం పట్ల ఉన్న ప్రేమను చాటి చెప్పింది. యుద్ధం అంటే ఇరువైపుల నష్టాలని గుర్తించిన భారత్ వివిధ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అమెరికా ఆఫ్ఘనిస్తాన్ పై దశాబ్దాలు యుద్ధం చేసి కూడా కంట్రోల్ లోకి తెచ్చుకోలేకపోయింది. రష్యా ఉక్రెయిన్ పై సంవత్సరాలు యుద్ధంచేసి కంట్రోల్ లోకి తెచ్చుకోలేకపోతోంది.భారత్ మాత్రం పాకిస్తాన్ మీద నిమిషాలు ట్రయల్ వార్ మాత్రం చూపించి పాకిస్తాన్ ని అష్టదిగ్బంధనం చేసి కంట్రోల్ లోకి తెచ్చింది. కాళ్ల బేరానికి వచ్చేటట్లు చేసింది . ఇదే మన భారతదేశ యుద్ధానికి,సనాతన ధర్మం.యుద్ధ తంత్రం తెలిసిన ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ కుమార్ డోవెల్ – మరియు వారి టీం..కి త్రివిధ దళాల నుండి కదం తొక్కించిన వ్యోమిక సింగ్, మరియు సోఫియాఖురేషి, విక్రమ్ మిశ్రీ కి అభినందనలు . యుద్ధంలో ప్రాణాలకు తెగించి, పాకిస్తాన్ వెన్నును ముఖ్య నగరాలలో, దాడులు చేసిన త్రివిధ దళాలకు అశేష భారతావని తరపున కృతజ్ఞత అభినందనలు .

రాజు అంటే శత్రువులను చంపడమే కాదు. తన దేశాన్ని ఎలా రక్షించుకోవాలి. అన్న రాజనీతి తెలిసి ఉండాలి. ప్రపంచానికి తన దేశం యొక్క శక్తి సామర్థ్యాలను చూపించి మెప్పించిన గొప్ప మానవతావాది మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. సంవత్సరాలు యుద్ధం చేసి తన దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చకుండా తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో గెలుపును అందుకోగలిగే బుద్ధి కుశలత ఉండాలి. పైవన్నీ తెలిసి ఆమోదింపజేసే చేసి ప్రపంచానికి భారత్ సత్తా చాటిన , అపార రాజనీతిజ్ఞులు భారత ప్రధాన మంత్రివర్యులు మాన్యశ్రీ మన నరేంద్రమోడీ కి ప్రత్యేక అభినందనలు . యుద్ధం ఎందుకు ఆపారని ప్రతిపక్షాలు, మరికొంత కూ హనా మేధావులు అక్కడక్కడ అనుమానాలు వ్యక్తం చేస్తున్న యుద్ధమనేది సంభవిస్తే ఎవరు గెలిచారు. అన్నదానికంటే ఎవరి ఏ దేశానికి తక్కువ నష్టం జరిగింది అనేదే ప్రధానంగా ఉంటుంది. ఇప్పటివరకు పాకిస్తాన్ సైన్యం గాని ఉగ్రవాదులు గాని కేవలం భారత దేశపు సరిహద్దుల్లో మాత్రమే దాడికి ఎక్కించారు మరియు ఎక్కడ నష్టం వాటిల్ల లేదు. ఇలాంటి సమస్య వచ్చినప్పుడు చర్చలు దౌత్య మాత్రమే ప్రధాన అజెండాగా ఉండాలి తప్ప యుద్ధానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు. ఎందుకంటే అమాయకులైన సైన్యం భారత ప్రజలు చనిపోయినప్పుడు వారి బాధ ఆ కుటుంబాలకు యావత్ భారతదేశాన్ని బాధిస్తుంది. రణం కంటే శాంతి చర్చలే మన దేశానికి సుభిక్షం. అంతేకాకుండా భారత్ యొక్క దమ్ము ధైర్యం, యుద్ధానికి సరిపడే శక్తి సామర్థ్యాలు, ఆయుధాలు దాన్ని వినియోగించే విధానం ప్రపంచం మొత్తం ఈ కొద్దీ రోజుల్లోనే తెలుసుకుంది మన యొక్క సత్తా ఏంది అనేది ప్రపంచ పౌరులకు అందరికీ అర్థమైంది. పాకిస్తాన్ డొల్లతనం కూడా బయటపడ్డది. కావున యుద్ధం నివారించడం పాలకుల యొక్క ప్రభుత్వం యొక్క మంచి నిర్ణయంగా చెప్పవచ్చును. భారతీయులు ఎవరితెరువు పోరని వారి దేశం జోలికి ఎవరొచ్చినా విడిచిపెట్టారని ఆపరేషన్ సింధూర్ నర్వగర్వంగా ప్రపంచానికి చాటి చెప్పింది. అంతేకాకుండా కేవలం అమెరికా దేశం మధ్యవర్తిత్వం వహించింది పాకిస్తాన్ కు మాత్రమే భారతదేశాన్ని కాదు పాకిస్తాన్ నశిస్తే అమెరికాకు నష్టమని భావించిన ఆ దేశం అధ్యక్షుడు వారిని యుద్ధం వద్దనిభావించి ప్రపంచ పటంలో ఆ దేశం కనుమరుగు కాకుండా కాపాడుకున్నాడనేది యదార్థం.



విశ్లేషణ:
**కూనూరు శ్రీనివాస్ గౌడ్**

# పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:**
మండలం కేంద్రానికి చెందిన రాపోలు ఉపేందర్ అనారోగ్యంతో భాదపడుతు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడంగా వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బూరుగు లక్ష్మమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మునుగోడు 60 - 70 సంవత్సరాలుగా చాలా వెనుకబడి ఉంది

**కరెంట్ విషయంలో చాలా రకాల సమస్యలు ఉన్నాయి**

**రాబోయే మూడు నాలుగు సంవత్సరాలలో కరెంటు సమస్యలు లేకుండా చేయాలి**

**మునుగోడు లో కరెంటు సమస్యలపై మునుగోడు క్యాంపు కార్యాలయంలో ఎన్నోసార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించాము**

**మునుగోడు నియోజకవర్గంలో కరెంటు సమస్యల పరిష్కారం, విద్యుత్ పనుల అభివృద్ధి కోసం 34 కోట్ల రూపాయలు మంజూరు చేయండి**

**నాణ్యమైన, భద్రతతో కూడిన కరెంటు ఇచ్చేలా రాబోయే కాలంలో ప్రజా ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తుంది**

**అన్ని రకాలుగా వెనుకబడిన మా మునుగోడు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అభివృద్ధి చేయండి**

**మునుగోడు నియోజకవర్గ కరెంటు సమస్యల పరిష్కారం, విద్యుత్ పనుల అభివృద్ధి కోసం మునుగోడు నియోజకవర్గ నాయకులతో కలిసి హైదరాబాదులోని TGSPDCL రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ ముషారఫ్ గారితో జరిగిన సమీక్షలో గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి**








**హైదరాబాద్ వెలుతురు మే 13:**
మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న కరెంటు సమస్యలు విద్యుత్ పనుల అభివృద్ధి పై మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులతో కలిసి హైదరాబాదులోని టీజీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయంలో సిఎండి ముషారఫ్ గారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఈ సమీక్ష సమావేశంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న లో వోల్టేజి సమస్య, అదనపు ట్రాన్స్ఫార్మర్ల కేటాయింపు, అదనపు సబ్ స్టేషన్ ల నిర్మాణం, లూజు లైన్ల సమస్యలు, గృహాలు ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల పైన ప్రమాదకరంగా ఉన్న కరెంటు వైర్లు తొలగింపు సమస్యలతోపాటు మరికొన్ని సమస్యలను సీఎం డి ముషారఫ్, యాదాద్రి నల్గొండ జిల్లాలకు సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు... ముఖ్య నాయకులు చెప్పిన సమస్యలను సావధానంగా విన్న సిఎండి ముషారఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న యాదాద్రి నల్గొండ జిల్లాల విద్యుత్ అధికారులను ఆదేశించారు....

నాణ్యమైన, భద్రతతో కూడిన కరెంటు ఇచ్చే విధంగా రాబోయే కాలంలో ప్రజా ప్రభుత్వం విద్యుత్ శాఖలో సమూలమైన సంస్కరణలు తీసుకొస్తుందని... ఆ సంస్కరణలు మొదట మునుగోడు నియోజకవర్గం నుండి మొదలుపెట్టాలని, మునుగోడు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని విద్యుత్ అభివృద్ధి పనులు చేయాలని సిఎండి ముషారఫ్ గారిని కోరారు.. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొని ఉన్న కరెంటు సమస్యలు పరిష్కరించడానికి 34 కోట్ల రూపాయల అవసరమవుతున్నాయని, ప్రత్యేక దృష్టితో 34 కోట్ల రూపాయల పనులను మంజూరు చేయాలని ముఖ్య నాయకులతో కలిసి సీఎండి ముషారఫ్ గారికి వినతి పత్రం అందజేశారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వేధించి ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్న విషయాలు నా దృష్టికి వచ్చాయని దీనివల్ల ప్రజాప్రతినిధులుగా మాకు , ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు.. దయచేసి ఎవరైతే అవినీతి పాల్పడుతున్నారో వారి పైన కఠిన చర్యలు తీసుకోని స్ట్రీమ్ లైన్ చేయాలని సీఎండి ముషారఫ్ గారిని కోరారు..

మునుగోడు పైన ప్రత్యేక దృష్టి ఉంటుందని, వ్యవసాయ పొలాల మధ్యన ఉన్న ట్రాన్స్ఫార్మర్స్ వెంటనే మార్పిస్తామని, ట్రాన్స్ఫార్మర్ల ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందన్నారు సిఎండి ముషారఫ్ అగ్రికల్చర్ డిపిఆర్లకు ఏబి స్విచ్లు మొత్తం పెంచుతామని, మే నుండి జూన్ మధ్యలో ఏబీ స్విచ్లు మొత్తం రిపేర్ చేయాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు..

మునుగోడుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పిన సిఎండి ముషారఫ్ గారికి మునుగోడు నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

ఈ సమావేశంలో నల్గొండ యాదాద్రి జిల్లాల విద్యుత్ అధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు....

# ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మనోహరాబాద్ లో తిరంగ యాత్ర చేపట్టారు





**మనోహరాబాద్ వెలుతురు మే 13:**
దేశంలో ఉద్రిక్తతలు ఈ నేపథ్యంలో మనం సైతం దేశం కోసం ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా, మనోహరాబాద్ మండల కేంద్రంలో మన దేశం కోసం ప్రాణాలను అర్పించిన భారత సైనికుల ధైర్య, త్యాగాలకు గుర్తింపుగా,అమరవీరుల జ్ఞాపకార్థం తిరంగ జెండాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ ఇమాంపురం వెంకటేష్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్,కొల్తూరి నరేష్ గౌడ్, మనివర్ధన్, కమ్మరి నరేందర్ చారి, ఎర్ర కృష్ణ, m. కిరణ్, నాయకుని బాలకృష్ణ,సందా శ్రీశైలం, చీరల భాస్కర్ యాదవ్, ప్రవీణ్ చారి,అనిల్ గౌడ్, చింత స్వామి, సందా కుమార్,పవన్, ఉదయ్, రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తీర్ణం విషయంలో అపోహలు వద్దు

*- ఆలయ అధికార మరియు అర్చక బృందం*

**వేములవాడ వెలుతురు మే 13:**
దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానమునకు విచ్చేసి స్వామి వారిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారని, ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంతో భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందజేయలేకపోతున్నామని, ఆ మేరకు ఆలయ విస్తీర్ణం పెంచాలనే చర్యలు ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్నట్లు దేవస్థానం ఓపెన్ స్లాబ్ నందు నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆలయ అధికారులు మరియు అర్చక బృందం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ జూన్ 15 నుంచి దేవస్థానం మూసివేస్తున్నట్టు వస్తున్న వార్తలు సత్య దూరమైనవని, ప్రధాన ఆలయ విస్తీర్ణం మరియు భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యం కు సంబంధించిన వివరాలను అతి త్వరలో వెల్లడిస్తామని, భీమేశ్వర ఆలయంలో పూర్తిస్థాయిలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే ప్రధాన ఆలయ విస్తీర్ణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. శృంగేరి పీఠాధిపతి అనుమతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాలు సూచనలు మేరకు గౌరవ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ప్రధానాలయాన్ని ఆగమశాస్త్ర బద్ధంగా విస్తీర్ణం పెంచబోతున్నామని, అందుకు సంబంధించిన విధివిధానాలు అతి త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఆలయం మూసివేయడం అంటూ ఏది ఉండదని, ఆలయం అభివృద్ధి చేసేటప్పుడు కూడా పూర్తిస్థాయిలో స్వామివారికి నిత్య కైంకర్యాలు జరుగుతూ ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు, ఆలయ అభివృద్ధి విషయంలో అధికారిక ప్రకటన జారీ చేసే వరకు భక్తులు ఎవరు ఆందోళనకు గురికావద్దని తెలియజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనులకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం మంజూరు చేసిన 76 కోట్ల రూపాయల తోనే జరుగుతుందని, ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 36 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం జరుగుతాయని, దేవస్థానమునకు భక్తుల ద్వారా సమర్పించబడిన డబ్బులేవీ కూడా ఇందుకు ఉపయోగించబడవని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి తో పాటు ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, ఆలయ కార్యనిర్వాహక ఇంజనీర్ రాజేష్, ప్రధానార్చకులు మరియు ఇన్చార్జి స్థానాచార్యులు ఉమేష్, ఉప ప్రధాన అర్చకులు శరత్ పాల్గొన్నారు.

# బాబు హనీమూన్ పూర్తయ్యింది: గిడుగు

**న్యూఢిల్లీ,మే13( వెలుతురు):**
సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. వాటిని అమలు చేయలేక డకౌట్ అయ్యారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. చంద్రబాబు తీరు చూస్తే వాగ్దానాలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ పూర్తయ్యిందని చమత్కరించారు. అమరావతి పేరుతో మళ్లీ భూసేకరణ చేయడానికి మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో భూమి ఇచ్చిన రైతులకే ప్రభుత్వం ఆర్థికంగా న్యాయం చేయలేదన్నారు. అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమరావతికి 7 వేల ఎకరాలు సరిపోతుందని గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు.

# ఐటి కమిషనర్ విషయంలో కీలక అంశాలు

**● లంచంగా రూ.2.5కోట్ల విలువైన ప్లాట్ రిజిస్ట్రేషన్**

**హైదరాబాద్,మే13( వెలుతురు):**
ఇటీవల ముంబయిలో సీబీఐకి చిక్కిన హైదరాబాద్ ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అతను రూ.70 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సంగతి తెలిసిందే. ముంబయికి చెందిన ఎన్‌డీడబ్ల్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.2.5కోట్ల విలువైన ప్లాట్‌ను లంచంగా తీసుకున్నట్లు- తేలింది. ఖమ్మం జిల్లాకు చెందిన బినామీ దండెల్ వెంకటేశ్వరుల పేరిట ఆ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించినట్లు- అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ముంబయిలోని మరో రెండు సంస్థల నుంచి రూ.35 లక్షలు లంచం తీసుకున్నట్లు- సీబీఐ గుర్తించింది. ఈ సొమ్మును హవాలా ద్వారా స్వీకరించినట్లు- దర్యాప్తు బృందం ఆధారాలు సేకరించింది. షాపూర్జీ పల్లోంజీ నిర్మాణ సంస్థ ట్యాక్సేషన్ ఫైల్ పెండింగ్‌ను క్లియర్ చేసేందుకు రూ.1.20 కోట్లు- లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐకి స్పష్టమైన సమాచారం ఉంది. ఇద్దరు మధ్యవర్తుల ద్వారా రూ.15 లక్షలు లంచం తీసుకున్న జీవన్ లాల్.. మరో రూ.70 లక్షలు తీసుకుంటుండగా పక్కా ఆధారాలతో సీబీఐ అధికారులు పట్టు-కున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 15 మందిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. లంచం ఇచ్చిన వారిని కూడా నిందితులుగా చేర్చారు.



## కళకళలాడుతున్న లాడ్ బజార్



**హైదరాబాద్, మే 13, ( వెలుతురు)**

హైదరాబాద్ నగరం పాతబస్తీలోని చార్మినార్ పరిసర ప్రాంతంలో ప్రసిద్ధ గాజుల మార్కెటే ఈ లాడ్ బజార్. ఇక్కడ ప్రత్యేకంగా తయారుచేసిన గాజులు విరివిగా దొరుకుతాయి. లాడ్ బజార్‌లో షాపింగ్ చేయడానికి వచ్చే ఆడవాళ్లతో ఆ ప్రాంతమంతా ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అంతటి పేరున్న ఈ ప్రాంతం కొన్ని రోజులుగా మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. దీనికి ప్రధాన కారణం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన అంతర్జాతీయ సుందరీమణులు ఇటీవల చార్మినార్‌ను సందర్శించడమే. ప్రపంచ దేశాల అందగత్తెలు ఈ ప్రాంతాన్ని సందర్శించడంతో అందరి నోళ్లలో ఇప్పుడు లాడ్ బజార్ పేరే వినబడుతోంది. దాంతో పాటు సహజంగానే అమ్మకాలు పెరిగినట్టు స్థానిక వ్యాపారస్తులు చెబుతున్నారు.అయితే.. ఇదే సందర్భాన్ని అవకాశంగా మలచుకున్న గాజుల వ్యాపారులు తమ షాపుల్ని కొత్తగా అలంకరిస్తున్నారు. సందర్శకులను, కొనుగోలుదారులను ఆకర్షించడానికి వింత వింత డిజైన్ల గాజులతో, ట్రెండీ కలర్స్‌తో, శబ్దాన్ని ఇస్తూ మెరిసిపోతున్న వయ్యారపు గాజులతో బజార్‌ను కళకళలాడేలా తీర్చిదిద్దుతున్నారు. పాకిస్థాన్, రాజస్థాన్, లక్నో వంటి తదితర ప్రదేశాల నుంచి తెప్పించిన ప్రత్యేక హ్యాండ్‌మేడ్ గాజులు ఇప్పుడు లాడ్ బజార్‌లో అందుబాటులో ఉన్నాయి.ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే చార్మినార్ పరిసరాలు ప్రపంచ అందగత్తెలు రాకతో మరింత కొత్త శోభను సంతరించుకున్నాయి. ఎప్పుడూ సందర్శకులతో హడావిడిగా ఉండే ఈ ప్రాంతం మిస్ వరల్డ్ బావమల సందర్శనతో మరింత సందడిగా మారింది. ఇది ఒక రకంగా నగర అభివృద్ధికి, వ్యాపార లావాదేవీలకు మంచి చేస్తుందని అంటున్నారు స్థానికులు. ప్రపంచ దేశాల సుందరీమణులు చార్మినార్ గాజులపై ఆసక్తి చూపడంపై స్థానిక వ్యాపారులకు కూడా కొత్త ఉత్సాహాన్ని ఇచ్చినట్లయింది. దీంతో ఇప్పుడు వివిధ దేశాల పర్యాటకులు కూడా ఈ ప్రాంతానికి రావడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా హైదరాబాద్ నగరంలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతుండడం.. నగర అభివృద్ధికే కాకుండా తమకు కలిసొచ్చిందని వ్యాపారాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు లాడ్ బజార్ అంటే కేవలం గాజుల మార్కెట్ మాత్రమే కాదు.. గ్లోబల్ గ్లామర్‌కు తెరతీసే అద్దం అవుతుందని, ఇది స్వాగతించదగిన పరిణామం అని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

## ఆంధ్రావాళ్లు...నాన్ లోకల్

### టాప్ ర్యాంక్ వచ్చిన లాభం లేదు

**హైదరాబాద్, మే 13, ( వెలుతురు)**

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన ఏపీ విద్యార్థులకు బ్యాడ్‌న్యూస్. టాప్ ర్యాంకులు సాధించినా సీట్లు మాత్రం రావు. ఈ విద్యా సంవత్సరం నుండి అమల్లోకి వస్తున్న కొత్త నిబంధనల ప్రకారం వారికి కన్వీనర్ కోటాలో 15 శాతం సీట్లు పొందే అవకాశం లేదు. విభజన చట్టంలోని పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కన్వీనర్ కోటాలోని 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయిస్తుండగా.. మిగిలిన 15 శాతం స్థానికేతర కోటా సీట్లు కూడా తెలంగాణ మూలాలున్న కుటుంబాల విద్యార్థులకే దక్కుతాయి.అంటే ఏపీ సహా.. ఇతర రాష్ట్రాల విద్యార్థుల తల్లిదండ్రులు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులైతేనే వారు ఈ కోటాకు అర్హులు. గత పదేళ్లలో ఏటా ఈ 15 శాతం కోటాలో 3,500 నుండి 4,000 సీట్లు ఏపీ విద్యార్థులకు దక్కేవి. ఈసారి ఆ అవకాశం లేకపోవడంతో తెలంగాణ విద్యార్థులకు ఆ మేరకు ప్రయోజనం చేకూరనుంది. దీనివల్ల ఈసారి మంచి కాలేజీల్లో కటాఫ్ ర్యాంకులు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలో ఇంటర్ చదివినప్పటికీ.. స్థానిక కోటా కింద సీటు పొందాలంటే విద్యార్థులు 6 నుండి ఇంటర్ వరకు ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలి. దీంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివిన చాలా మంది ఏపీ విద్యార్థులు స్థానికేతరులుగా పరిగణించబడతారు. వారు మంచి ర్యాంకులు సాధించినా.. కన్వీనర్ కోటా సీటు మాత్రం పొందలేరు.విజయవాడలోని కాలేజీల్లో చదివిన విద్యార్థులు ప్రాక్టీస్ కోసం తెలంగాణ ఎంసెట్ రాసినా.. వారు కూడా ప్రవేశానికి అర్హులు కాదు. నిజానికి ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు చాలా మంది జేఈఈ మెయిన్‌లోనూ మంచి ర్యాంకులు పొందినవారే. వారు ఐఐటీలు లేదా టాప్ ఎన్ఐటీల్లో సీట్లు పొందుతారు. కాబట్టి, ఎంసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన తెలంగాణ విద్యార్థులు కూడా ఇక్కడ చేరేది చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## వరంగల్ నుంచి రెండు వందేభారత్ ట్రైన్స్

**వరంగల్, మే 13, ( వెలుతురు)**



వరంగల్ ప్రజలకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. మే నెల చివరి నాటికి రెండు వందే భారత్ స్లీపర్ రైళ్లు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లు ప్రయాణికులకు విమాన ప్రయాణ అనుభూతిని అందించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడ్డాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ – విశాఖపట్టణం – సికింద్రాబాద్ మధ్య వరంగల్ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి.వీటికి అదనంగా స్లీపర్ తరగతి వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ రైళ్లలో కూర్చుని ప్రయాణించేందుకు చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ తరగతులు ఉన్నాయి. అయితే.. కొత్తగా ప్రవేశపెట్టనున్న స్లీపర్ రైళ్లు రాత్రి వేళ ప్రయాణించే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటాయి.వందే భారత్ రైళ్లు చాలా వేగంగా ప్రయాణిస్తున్నాయన్న సంగతి తెలిసిందే.. అయితే పడుకొని ప్రయాణించడానికి అవకాశం లేదని చాలా మంది ప్రయాణికులు నిరుత్సాహానికి గురవుతున్నారు. దూరం వెళ్లే వారు అంత సమయం కూర్చొని వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.. దీంతో కొత్తగా ప్రవేశపెట్టే వాటిలో ఈ సౌకర్యం ఉండనుంది. ఇక ఏం చక్కా పడుకొని మీ జర్నీని స్టార్ట్ చేయవచ్చు.స్లీపర్ రైలు ట్రయల్ రన్.. 180 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లిందిగంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. మొదటి దశలో దేశవ్యాప్తంగా 9 రైళ్లు ప్రవేశపెడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు 2 రైళ్లు కేటాయించారు. రెండు రైళ్లు వరంగల్ మీదుగా ప్రయాణిస్తాయి. ఒకటి విజయవాడ నుండి అయోధ్య (వారణాసి) వరకు, మరొకటి సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు నడుస్తాయి. ప్రతి రైలులో 16 బోగీలు ఉంటాయి .రైల్వేశాఖ ఈ రైళ్ల టికెట్ ధరలు, ఆగే స్టేషన్ల వివరాలను ఇంకా వెల్లడించలేదు. ఈ నెలాఖరులోగా వీటిని ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ మీదుగా స్లీపర్ వందే భారత్ రైళ్లు ప్రారంభం కానుండటం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పడుకొని వందేభారత్ రైళ్లో ప్రయాణించాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

## ఎంపీ ఈటల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలతో ఎదురుదాడి చేయించడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్ధతకు నిదర్శనం.

### బిజెపి ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పవర్, పైడి రాకేష్ రెడ్డి, డా. పాల్వాయి హరీష్ బాబు



**హైదరాబాద్ వెలుతురు మే 13:**

బిజెపి ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పవర్, పైడి రాకేష్ రెడ్డి, డా. పాల్వాయి హరీష్ బాబు లు 2025 మే 13న హైదరాబాద్ లో విడుదల చేసిన పత్రికా ప్రకటన ఎంపీ ఈటల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలతో ఎదురుదాడి చేయించడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్ధతకు నిదర్శనం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ సర్కారు అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న అంశంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ గారు లేవనెత్తిన ప్రశ్నలు, ఆరోపణలు, విమర్శలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నేతలు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలతో ఎదురుదాడి చేయించడం సీఎం రేవంత్ రెడ్డి గారి చాతగాని తనానికి, అసమర్ధతకు నిదర్శనం. పేదల జోలికి వెళ్లొద్దన్న సూచనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా పేదల ఇళ్లను కూల్చివేస్తూ తుగ్లక్ పాలన సాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గారు ఓ సైకోలా, శాడిస్టుల వ్యవహరిస్తున్నారన్న ఎంపీ ఈటల రాజేందర్ గారి వ్యాఖ్యలు పూర్తిగా సమర్ధనీయం. పాలన సరిగా నిర్వహించని సందర్భాల్లో ముఖ్యమంత్రులను సైకో, శాడిస్టు అని విమర్శించిన సందర్భాలూ గతంలోనూ ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పేదలకు ఎలాంటి పునరావాసం కల్పించకుండా వారి నివాసాలను హైడ్రా సంస్థ కూల్చివేస్తుండడంతో, పేదలు నిర్వాసితులు అవుతున్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి గారు తక్షణమే స్పందించాలి. పేదల పునరావసం గురించి ముఖ్యమంత్రి స్పందించకుండా ఎంపీ ఈటల రాజేందర్ గారిపై కాంగ్రెస్ నేతలు మహేష్ కుమార్ గౌడ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డిలచే ఎదరుదాడి చేయించడం ముమ్మాటికీ దివాళాకోరు రాజకీయమే. బీఆర్ఎస్ హయాంలో కేసిఆర్ క్యాబినెటు నుంచి ఈటల గారిని బర్తరఫ్ చేసినపుడు బీసీ నేతకు అన్యాయం, అవమానం అని మాట్లాడిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ గారికి గుర్తుకు లేవా ... ఈటల రాజేందర్ గారిది ఏ కులం అని మాట్లాడడం పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ అతి తెలివికి నిదర్శనం. ఇక ఈటల రాజేందర్ గారి బట్టలు విప్పి గుంజీలు తీయిస్తానంటూ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి మాట్లాడడం ఆయన చిల్లర రాజకీయాలకు అద్దం పడుతోంది. సీఎం రేవంత్ రెడ్డి కూడా మాట్లాడితే ప్రతిపక్ష నేతల బట్టలు విప్పిస్తానంటారు. కాంగ్రెస్ నేతల కామెంట్లు చూస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి గారు రాసిచ్చిన స్క్రిప్టునే చదివినట్టు ఉంది. ముఖ్యమంత్రి ప్రాపకం కోసం, పదవుల కోసం, పనుల కోసం మహేష్ కుమార్ గౌడ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి గారిని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించిన అంశాలకు సమాధానం ఇవ్వకుండా ఎదురుదాడికి దిగుతున్నారు. పేదల ఇళ్లను కూల్చుతున్న హైడ్రాకు హైదరాబాదు పాతబస్తీలో ఓ చెరువును ఆక్రమించి ఎంఐఎం అధినేత ఓవైసీ నిర్మించిన కాలేజీని కూల్చే దమ్ము లేదా, ఎందుకని బుల్డోజర్లు పాతబస్తీకి పోలేకపోతున్నాయి. అకడిమిక్ ఇయర్ మధ్యలో కూల్చితే విద్యార్థులు నష్టపోతారని చెప్పిన హైడ్రాకు ఇపుడు వేసవి సెలవులని గుర్తులేదా. మరిపుడు ఎందుకని హైడ్రా బుల్డోజర్లు పాతబస్తీలోని ఓవైసీ గారి కాలేజీకి వెళ్లి కూల్చడం లేదు. మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గారికి చెందిన ఓ కాలేజీ కూడా చెరువును ఆక్రమించుకుందన్న హైడ్రా దాన్ని కూడా వేసవి సెలవుల్లో కూల్చుతామని ప్రకటించింది కదా, మరి ఏమైంది. ఇపుడు ఎవరాపుతున్నారు హైడ్రాని. చాతనైతే ఈ ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి గారు సమాధానం చెప్పాలని సవాల్ చేస్తున్నాం. ప్రతిపక్ష బిజెపి లేవనెత్తే ప్రశ్నలకు అధికార పార్టీ నేతలు చాతనైతే సమాధానం చెప్పాలే కానీ, వ్యక్తిగత దూషణలతో ఎదురుదాడికి దిగడం కాంగ్రెస్ మార్క్ దివాళాకోరు రాజకీయమే.

## బజాజ్ గోగో లో నూతన ఎలక్ట్రిక్ ఆటో లను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- **62 ఏళ్ల నుండి బజాజ్ మోటార్ ఫీల్డ్ లో ఉంది**
- **ఢిల్లీ కాలుష్యం కారణంగా ప్రజలు నివాసయోగ్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు..**



**హైదరాబాద్ వెలుతురు మే 13:**

ది పార్క్ హోటల్ లో బజాజ్ గోగో లో నూతన ఎలక్ట్రిక్ ఆటో లను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బజాజ్ గోగో లో నూతన ఎలక్ట్రిక్ ఆటో ఆవిష్కరణ సందర్భంగా వారికి శుభాకాంక్షలు.. 62 ఏళ్ల నుండి బజాజ్ మోటార్ ఫీల్డ్ లో ఉంది మారుతున్న కాలానికి అనుగుణంగా బజాజ్ వినియోగదారునికి సమాజానికి ఉపయోగపడే విధంగా ఈవి వాహనాలకు తీసుకొచ్చింది ఢిల్లీ కాలుష్యం కారణంగా ప్రజలు నివాసయోగ్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు.. అక్కడున్న పరిస్థితులు ఇక్కడ రావద్దని తెలంగాణ ప్రభుత్వం 2026 వరకు అమలు అయ్యే విధంగా ఈవి పాలసీ తీసుకొచ్చింది దేశంలోనే మొదటిసారి అన్ని రకాల ఈవి వాహనాలకు జీరో టాక్స్ చేశాం ఆదాయపరంగా నష్టం జరుగుతున్న కాలుష్యం పరంగా నష్టం జరగద్దని ఈ నిర్ణయం తీసుకున్నాం ఈవి , ఎల్పీజీ, సిఎన్జీ వాహనాలు పెరుగుతున్నాయి ట్రిపుల్ రింగ్ రోడ్డు లోపల ప్రతి వాహనం ఈవీ, cng , LPG చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది హైదరాబాద్ దాదాపు 2800 ఆర్టీసీ బస్సులు ఈవి చేయాలని ప్రణాళికలు నడుస్తున్నాయి కేంద్ర మంత్రి గడ్కరీ దగ్గర ఇప్పటికే చర్చించాము గూడ్స్,ప్రయాణికుల వాహనాలు కూడా ఈవి ఆటోలు వచ్చాయి..సూపర్ లగ్జరీ ఉండేలా కొత్త ఆటో కి రూపం ఇచ్చారు ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఉపాధి అవకాశాల కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిందిఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇచ్చిన తరువాత ఆటో వాళ్ళకి ఇబ్బందులు కదులుతున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారు ఆర్టీసీ బస్సులు బస్ స్టేషన్ నుండి వెళ్తాయి..ఆటో లు ఇంటి దగ్గర నుండి మనం చివరి గమ్యం వరకు వస్తాయి హైదరాబాద్ లో కొత్త ఆటో లకు పర్మిట్ ఇవ్వడం లేదు..ప్రభుత్వం ఆలోచిస్తుంది ఇప్పటికే ఉన్న పాత ఆటోలకు రెట్రో ఫిటింగ్ ఇంజన్స్ ప్రయత్నం చేయండి తెలంగాణ ప్రభుత్వం వాహన సారధి తీసుకొచ్చాం, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం..









## సత్యదేవుని సన్నిధిలో సింధూర ప్రియుని నామస్మరణ



**కరీంనగర్ వెలుతురు మే 13:**

కరీంనగర్ జిల్లా కేంద్రం రాంనగర్ లోని ప్రముఖ ఆలయమైన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి మరియు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయము నందు ఆంజనేయుడి నామస్మరణ, భజనలతో మార్మోగింది. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి ప్రీతిపాత్రమైన మంగళవారం రోజున హనుమాన్ మాలాధారణ దీక్ష స్వాములతో "హనుమాన్ భజన" కార్యక్రమాన్ని చేపట్టారు. భజన కార్యక్రమానికి ముందు దేవాలయ అర్చకులు బహిరి అనీల్ కుమార్, తిరునహరి ప్రవీణ్ కుమార్ ల ఆధ్వర్యంలో ఆంజనేయుడి ఉత్సవ విగ్రహానికి ఫల, పంచామృత అభిషేకం నిర్వహించి ఆంజనేయుడి మాలాధారణ దీక్ష విశిష్టతను తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మల్లిఖార్జున రాజేందర్ మాట్లాడుతూ.. నమ్మినవారికి నేనున్నానంటూ వరాలు ఇచ్చే దేవుడు అంజన్న స్వామి అని, చిన్నపిల్లల నుండి పెద్దల వరకు 'అంజన్న' అని పిలిస్తే పలుకుతాడనే నమ్మకం కలిగిన దేవుడు ఆంజనేయస్వామి అని అన్నారు. జిల్లాలో ప్రసిద్ధి పొందిన ఈ సత్యదేవుని ఆలయంలో హనుమాన్ స్వామి దీక్షాపరులతో భజన కార్యక్రమం నిర్వహించి స్వాములకు అన్నవితరణ చేయడంతో భక్తి భావాన్ని చాటుకున్నట్లయిందని తెలిపారు. ఆంజనేయ స్వామి అభిషేకము, హనుమాన్ భజన కార్యక్రమంలో పాల్గొన్న స్వాములకు, భక్తులకు, కాలనీవాసులకు స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మల్లిఖార్జున రాజేందర్, చైర్మన్ చల్ల హరికృష్ణ, మాజీ చైర్మన్ ఏ. కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు వేదాంతం సత్యనారాయణ, రంగు చెన్నయ్య గౌడ్, బొల్లబత్తిని రవీందర్, వంగ హరీష్ గౌడ్, స్వాములు వరాల దేవేందర్, వంగ శ్యామ్, కొత్త అనీల్, శంకర్, దేవాలయ అర్చకులు బహిరి అనీల్ కుమార్, తిరునహరి ప్రవీణ్ కుమార్, పి.ఆర్.ఓ సీమకుర్తి మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





# పాకిస్తాన్ లో విజిలెంట్ హ్యాకర్లు



**ఇస్లామాబాద్, మే 13, ( వెలుతురు)**

భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత ప్రభావం ఇప్పుడు సరిహద్దులకు మాత్రమే పరిమితం కాలేదు. డిజిటల్ ప్రపంచంలో కూడా ప్రతిధ్వనిస్తోంది. తాజా నివేదికల ప్రకారం, ఒక సైబర్ ఆపరేషన్ "ఆపరేషన్ సైబర్ శక్తి" లో భాగంగా భారతీయ హ్యాకర్లు పాకిస్తాన్ అనేక ముఖ్యమైన వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ వ్యవస్థపై పడ్డారు. భారతీయ హ్యాకర్ల దెబ్బకు పాకిస్థాన్‌లోని కీలక వ్యవస్థలు ఆగమాగమయ్యాయి. ఇది భారతీయ "విజిలెంట్" హ్యాకర్లు నిర్వహిస్తున్న ఒక అనధికారిక సైబర్ క్యాంపెయిన్. ఇందులో పాకిస్థాన్‌పై డిజిటల్ యుద్ధం చేస్తుంటారు. ఇక్కడ వార్ కోడ్‌లు, కీబోర్డ్‌ల ద్వారా జరుగుతోంది. ఇందులో పాకిస్తాన్‌కు చెందిన అనేక ప్రభుత్వ, రక్షణ సంబంధిత వెబ్‌సైట్‌లను లక్ష్యంగా చేసుకున్నారు. నివేదికల ప్రకారం, ఈ క్యాంపెయిన్‌లో ఫిషింగ్, డేటా బ్రీచ్, వెబ్‌సైట్ డిఫేస్‌మెంట్ వంటి హై-ప్రొఫైల్ సైబర్ దాడులు చేపట్టారు. ఈ మిషన్ వెనుక ఎటువంటి ప్రభుత్వ సంస్థ లేదు, కానీ ఇది స్వతంత్ర హ్యాకింగ్ గ్రూప్, ఇది సరిహద్దులో జరుగుతున్న దుశ్చర్యలకు ఇలా డిజిటల్ ప్రతిస్పందన ఇస్తోంది.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X (ముందుగా ట్విట్టర్) లో పంచుకున్న సమాచారం ప్రకారం, ఆపరేషన్ సైబర్ శక్తిలో భాగంగా పాకిస్తాన్ జైళ్లకు సంబంధించిన డేటాను లీక్ చేశారు. అంతేకాకుండా, సైనిక ఇంజనీరింగ్ సర్వీసుల డేటాబేస్ కూడా సైబర్ దాడి బారిన పడింది. పాకిస్తాన్ పాత పవర్ ప్లాంట్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని కూడా యాక్సెస్ చేసినట్టు వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించిన డేటాను కూడా యాక్సెస్ చేశారని వాదన ఉంది. ఈ హ్యాకర్ గ్రూప్ ప్రకారం, వారు ఇప్పటి వరకు 700 కంటే ఎక్కువ పాకిస్తాన్ వెబ్‌సైట్‌లను డౌన్ చేశారు. 1000 కంటే ఎక్కువ %జజుఎ% నెట్‌వర్క్‌లను యాక్సెస్ చేశారు. ఈ దాడి భారతదేశం నుంచి మాత్రమే కాదు, సింగపూర్, అమెరికా వంటి ప్రదేశాల నుంచి కూడా జరిగింది, దీని వలన అనేక పాకిస్తాన్ సైట్లు అంతర్జాతీయ స్థాయిలో కూడా యాక్సెస్ చేయలేకపోయాయి.2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా, భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. భారత సైన్యం పాకిస్తాన్‌ను గట్టిగానే దెబ్బ కొట్టింది. ఆ విధ్వంసాన్ని దాచి పెట్టడానికి పాకిస్థాన్ చాలా ప్రయత్నం చేసింది కానీ అది వీలు కావడం లేదు. దీనికి ఉదాహరణ భారత్ దాడిలో ధ్వంసమైన రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఇప్పుడు పనిచేయడం లేదు. అక్కడ మరమ్మత్తు చేపడుతోంది. పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న ఈ ఎయిర్‌బేస్, ఏకైక రన్‌వేను ఒక వారం పాటు మూసివేశారు. ఎయిర్‌మెన్‌లకు పాకిస్తాన్ సివిల్ ఏవియేషన్ అథారిటీ జారీ చేసిన నోటీసులో ఇది స్పష్టమైంది. మే 18 వరకు కొనసాగుతుంది.రన్‌వేను మూసివేయడానికి కారణం పని పురోగతిలో ఉందని NOTAM తెలిపింది. కానీ పాకిస్తాన్ చాకచక్యంగా వ్యవహరించి దానిని మూసివేయడానికి గల కారణాలను చెప్పలేదు. ఇది విమాన కార్యకలాపాలకు అందుబాటులో ఉండదని మాత్రమే చెప్పింది. అందుకే నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌పై భారతదేశం ప్రతీకార దాడి చేసినట్లు స్పష్టమైంది.

# మరింత ముందుగా నైరుతి రుతుపవనాలు

**హైద్రాబాద్, మే 13, ( వెలుతురు)**

ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న టైంలో ఐఎండీ గుడ్ న్యూస్ చెప్పింది. అనుకున్న టైం కంటే ముందే రుతుపవనాలు వచ్చేస్తున్నట్టు వెల్లడించింది. ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు నిజంగా ఇది మంచి గుడ్ న్యూస్. మే 30 నాటికి దేశంలోకి రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కానీ అంతకంటే ముందుగానే వచ్చేస్తున్నట్టు మారిన వాతావరణం బట్టీ ఐఎండీ స్పష్టం చేసింది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా అనుకున్న అంచనాలు కంటే నాలుగు రోజులు ముందుగానే వచ్చేస్తున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. మే 15 తర్వాత అండమాన్ నికోబార్ దీవులకు రుతుపవనాలు చేరుకుంటాయని అంచనా వేశారు. కానీ ఇప్పుడు ఉన్న అనుకూల వాతావరణం చూస్తే ఈ రెండు రోజుల్లోనే వర్షావరణం ప్రారంభంకానుందని స్పష్టమవుతుంది. రేపు లేదా ఎల్లుండి ఉదయం అండమాన్‌కు తాకనున్న రుతుపవనాలు... 25 తర్వాత ఎప్పుడైనా కేరళను తాకబోతున్నాయి. ఇప్పుడు ఉన్న అంచనాల ప్రకారం ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడతాయని చెబుతున్నారు. చాలా ప్రాంతాల్లో గతేడాది కంటే ఎక్కువ వర్షాలు పడతాయని లెక్కలు వేస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత మధ్య భారత వాతావరణ శాఖ పెచ్చిన గుడ్ న్యూస్ రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం నింపింది. కేరళలో రుతుపవనాల రాక భారతదేశంలో వర్షాకాలం ప్రారంభంగా పరిగణిస్తారు. వ్యవసాయానికి ఈ సీజన్ చాలా ముఖ్యమైంది. సాధారణంగా రుతుపవనాలు జూన్ 1న వస్తాయి. కానీ ఈసారి మాత్రం చాలా ముందుగానే వస్తున్నట్టు వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 2020 సంవత్సరంలో భారతదేశంలో జూన్ 1న, 2021 సంవత్సరంలో జూన్ 3న, 2022 సంవత్సరంలో మే 29న, 2023 సంవత్సరంలో జూన్ 8న, 2024 సంవత్సరంలో మే 30న రుతుపవనాలు దేశంలోకి వచ్చాయి. ఇప్పుడు మాత్రం వారం రోజులు ముందుగానే వస్తున్నట్టు లెక్కలు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో గత కొన్ని రోజులుగా భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ దంచి కొడుతోంది. సాయంత్రం నాలుగు తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ అకాల వర్షాలు రైతులకు చాలా నష్టం కలిగించాయి. ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.ం

# 27ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై పెట్టిన కేసులను ఉపసంహరించి భేషరతుగా క్షమాపణ చెప్పాలి..

## హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి మిడిదొడ్డి రాజు..

**జమ్మికుంట మే 13, ( వెలుతురు)**

సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షపూరితంగా మరియు అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకొని భేషరతుగా ఆయనకు క్షమాపణలు చెప్పాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి మిడిదొడ్డి రాజు, మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మిడిదోడ్డి రాజు, మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి వారిని మానసికంగా బాధపెట్టడం తగిన పద్ధతి కాదని పత్రిక స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడి పత్రిక విలువను కాలరాయడమేనని నేటి సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలను అక్రమాలను ప్రతి ఒక్క విషయాన్ని స్వేచ్ఛగా వార్తలు వ్రాసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో పత్రికలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపైన ఎలాంటి నోటిసులు ఇవ్వకుండానే అక్రమంగా వారి నివాసంలోకి చొరబడి సోదాలు నిర్వహించడం పత్రిక స్వేచ్ఛను హరించడం అవుతుందని మిడిదొడ్డి రాజు, మండిపడ్డారు.

# హాట్ టాపిక్ గా మారిన దామోదర


**మెదక్, మే 13, ( వెలుతురు)**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాఫిగ్గా మారాయి. తాను కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కాకపోయినా తనకు ఏంసంబంధం లేకపోయినా జగిత్యాల రాజకీయంపై దామోధర రియాక్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆల్ ఆఫ్ సడెన్ గా జగిత్యాల జిల్లా పర్యటనకు వెళ్లారు మంత్రి దామోధర రాజనర్సింహ. ధర్మపురిలో ఏదో మొక్కు తీర్చుకున్న ఆయన.. జగిత్యాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో రివ్యూ చేశారు.ఆ తర్వాత నేరుగా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అంతవరకు అంతా బాగానే ఉన్నా.. జీవన్ రెడ్డి నివాసంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి పెద్ద అసెట్ అని..అసలు సిసలైన కాంగ్రెస్ వాది అంటూ కామెంట్స్ చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్ నేతని..పార్టీలో ఆయన గౌరవాన్ని కాపాడేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానంటూ చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.మంత్రి దామోదర రాజనర్సింహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇంచార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కరీంనగర్ జిల్లా రాజకీయాలతో ఆయనకు ఏం సంబంధం లేదు. అయితే రెండు రోజుల క్రితం జగిత్యాల జిల్లాకు వెళ్లిన మంత్రి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అంతేకాదు.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ సిచువేషన్ సెన్సిటీవ్ గా ఉన్నప్పటికీ జీవన్ రెడ్డికి మద్దతుగా ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు.అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచే అక్కడ సీనియర్‌నేత మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి,



సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య పరిస్థితి ఉప్పు, నిప్పులా మారింది. ఇద్దరు నేతల మధ్య మాటలయుద్ధం రోజు రోజుకు తారాస్థాయికి చేరుతోంది. ఇద్దరి మధ్య పచ్చిగడ్డి భగ్గుమనేలా పరిస్థితి తయారైందట. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి దామోదర జీవన్‌రెడ్డికి మద్దతుగా కామెంట్స్ చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అసలు జీవన్ రెడ్డి విషయంలో ఇన్ని రోజుల తర్వాత మంత్రి దామోదర ఇప్పుడే ఎందుకిలా కామెంట్స్ చేశారన్నదానిపై రకరకాల ఊహాగానాలు విన్పిస్తున్నాయి.మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కొంత కాలంగా చేస్తున్న కామెంట్స్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టే విధంగా ఉంటున్నాయనే చర్చ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది. పార్టీ ఫిరాయింపులతో పాటు తరచూ ఏదో ఒక ఇష్యూపై జీవన్‌రెడ్డి కామెంట్స్ చేస్తున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీలో ముఖ్యమైన నేతలు కూడా జీవన్‌రెడ్డి విషయంలో అంటీముట్టనట్టే వ్యవహరిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఇన్నాళ్లు జీవన్ రెడ్డి విషయంలో ఎప్పుడూ స్పందించని దామోధర ఇప్పుడు ఆయనను వెనుకేసుకొస్తూ మాట్లాడ్డం వెనుక మరేదో ఉందనే టాక్ నడుస్తోంది. ఈ మధ్య జరిగిన ఐఏఎస్ బదిలీల విషయంలో ఆరోగ్య శాఖలోని ఇద్దరు అధికారులను మంత్రికి సంబంధం లేకుండా బదిలీ చేశారనే చర్చ నడుస్తోంది. అప్పటినుండి రగిలిపోతున్న దామోధర ఇప్పుడిలా రియాక్ట్ అయ్యారనే టాక్ విన్పిస్తోంది.అయితే కరీంనగర్ జిల్లాలో జీవన్ రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్ కి మధ్య అస్సలు పొసగడంలేదని బహిరంగ రహస్యమే. సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజూరు చేయించుకుంటున్నారట.అయితే సంజయ్ కుమార్ కి, జీవన్ రెడ్డికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరిన ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి దామోదర చేసిన కామెంట్స్ ఇప్పుడు కాకపుట్టిస్తున్నాయి. దీనిపై సంజయ్ కుమార్ వర్గం అసహనం వ్యక్తం చేస్తుండగా అటు సీయం రేవంత్ ఈ అంశంపై ఎలా రియాక్ట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# అందుబాటులోకి జీహెచ్ఎంసీ యాప్




**హైదరాబాద్, మే 13, ( వెలుతురు)**

హైదరాబాద్ నగర జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. జనాభా తోపాటు.. సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మై జీహెచ్ఎంసీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా సమస్యల పరిష్కారాన్ని సులభతరం చేశారు. పలు సేవలను అందిస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజల కోసం జీహెచ్ఎంసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పలు రకాల పౌర సేవలను అందించడానికి 'మై జీహెచ్ఎంసీ' మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా అందించే సేవలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ వివరించారు. నగర పౌరులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అరచేతి నుంచే సేవలను పొందాలని సూచించారు..ఈ యాప్ ద్వారా పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, ఆరోగ్యం, వీధి దీపాలు, మురుగునీటి సమస్య, రహదారులను ఊడ్చడం వంటి సమస్యలపై ఫిర్యాదు చేయాల్సి వస్తే.. ఫొటో తీసి సమస్య ఉన్న ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయవచ్చు..పౌరులు పంపిన ఫొటోలను కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలిస్తారు. యాప్‌లో ఫిర్యాదు నమోదైన ప్రాంతానికి సంబంధిత అధికారులను పంపిస్తారు..ఫిర్యాదు చేసిన వ్యక్తి మొబైల్‌కు కంప్లైంట్ నంబర్, సంబంధిత అధికారి ఫోన్ నెంబర్లతో మెసేజ్ వస్తుంది. యాప్‌లో ఫిర్యాదు పరిష్కారమైందా, లేదా అని సూరిచూసుకోవచ్చుసమస్య పరిష్కారం కాకపోయినా.. అయినట్టు చూపే అధికారులపై కంట్రోల్ రూమ్ నంబర్ 040-21111111 కు ఫిర్యాదు చేయొచ్చు.సమస్యల పరిష్కారమే కాకుండా.. పలు సేవల కోసం దీన్ని వినియోగించవచ్చు. ట్రేడ్ లైసెన్సుకు దరఖాస్తు, ఆస్తిపన్ను మదింపు, పెంపుడు శునకానికి లైసెన్సు తీసుకోవడం, నిర్మాణ వ్యర్థాల తరలింపునకు వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు.ప్రజల నివాస ప్రాంతాల్లో దోమల సమస్య, వీధి దీపాల ఏర్పాటు, రోడ్లపై గుంతలు, వీధి కుక్కలు, ఆహార కల్తీ, తదితర సమస్యలపైనా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.ట్రేడ్ లైసెన్సు, ఆస్తిపన్ను, ఇతరత్రా పన్నులను డెబిట్ కార్డు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. జీహెచ్ఎంసీ కార్యాలయాలు, వార్డు ఆఫీసులు, ప్రజా మరుగుదొడ్లు, వాతావరణ సమాచారం.. ఇలా చాలా అవసరమైన సేవలు పొందవచ్చు..గ్రేటర్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్‌ను మరింత సులభతరంగా మార్చామని.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించుకుని వ్యక్తిగత, సమాజ సమస్యల పరిష్కారం పొందవచ్చని చెప్పారు..ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది. దీన్ని ప్లే స్టోర్, యాప్ స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.డిజిటల్‌గా సంతకం చేసిన జనన, మరణ ధృవపత్రాలను దీని ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటి నుంచి నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి ఈ యాప్ ద్వారా వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు.

# అమెరికాకు భారత్ స్టాండ్ వివరించిన ప్రధాని

**న్యూఢిల్లీ మే 13, ( వెలుతురు)**

జాతీని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి మోదీ కీలక విషయాలపై క్లారిటీ ఇచ్చారు. వందల ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న జమ్ముకశ్మీర్ సమస్యను తాను పరిష్కరిస్తానంటూ ఆదివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇది ఇండియాలో పెద్ద చర్చకే దారి తీసింది. అయితే ప్రధానమంత్రి మోదీ మాత్రం ఈ అంశాన్ని ప్రస్తావించకుండానే చాలా క్లియర్‌గా పెద్దన్న అవసరం లేదు అని చెప్పేశారు. అసలు జమ్ముకశ్మీర్‌పై సమస్యే లేదని స్పష్టం చేశారు.పాకిస్థాన్‌తో తాను చర్చలకు కూర్చోవాలంటే అది పీవోకే, ఉగ్రవాదంపై మాత్రమే అని చెప్పిన ప్రధాన మంత్ర మోదీ టోన్‌లో చాలా డెప్త్ ఉందని అంటున్నారు. జమ్ముకశ్మీర్ అనేది ఇక్కడ సమస్య కాదని పీవోకే మాత్రమే సమస్యగా చెప్పేశారు. అన్నింటి కంటే ముఖ్యమైన మరో సమస్య ఉగ్రవాదమని ఈ రెండు విషయాలపై మాత్రమే చర్చించేందుకు సిద్ధమని తేల్చి చెప్పారు.ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి చేయలేమని ప్రధాని మోదీ అన్నారు మరియు "నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని అన్నారు. జమ్మూ కాశ్మీర్ లో పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన రెండు వారాల తర్వాత, మే 7న భారతదేశం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ పై ప్రధాని మోదీ తొలి స్పందన ఇది. ఇది యుద్ధాల యుగం కాదు' అనే తన సందేశాన్ని పునరుద్ఘాటించారు. అలాగనే ఉగ్రవాదుల యుగం కూడా దాని తెలిపారు. "యుద్ధభూమిలో ప్రతిసారీ పాకిస్తాన్



ఓడిపోయింది. ఈసారి ఆపరేషన్ సిందూర్‌లో కొత్త అంశాన్ని జోడించాం. ఆపరేషన్ టైంలో 'భారతదేశంలో తయారు చేసిన' ఆయుధాలను వాడాం. వాటి ప్రామాణికత నిరూపితమైంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో అందరం ఐక్యంగా ఉండాలి. ఈ ఐక్యత మనకు అతిపెద్ద బలం" అని మోదీ అన్నారు.మే 10న ప్రకటించిన కాల్పుల విరమణ ఒప్పందం గురించి మాట్లాడుతూ "మొదటి మూడు రోజుల్లోనే పాకిస్తాన్‌లో భారత్ భారీ విధ్వంసం సృష్టించింది, అది వారిని పూర్తిగా నిస్సహాయులను చేసింది. భారత్ దూకుడు ఫలితంగా ఉద్రిక్తత తగ్గించడానికి పాకిస్థాన్ మార్గాలు వెతుక్కుంది. అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. పూర్తిగా ఓడిపోయిన తర్వాత మే 10 మధ్యాహ్నం మన DGMOని సంప్రదించి వేడుకుంది." అని ఈ క్రెడిట్ కూడా అమెరికాకు ఇవ్వలేదు మోదీ. పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని చెప్పారు. అంతే కానీ అమెరికా చెప్పిందనో ఎవరో బెదిరించారోనే వెనక్కి తగ్గలేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించడానికి ముందు మీడియాతో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఇష్యూలో తానే క్రెడిట్ కొట్టేసేందుకు యత్నించారు. అందుకే ఇరు దేశాలతో చర్చలు జరిపామని అంగీకరించకుంటే వ్యాపారాలు నిలిపేస్తామని వార్నింగ్ ఇచ్చినట్టు బిల్డప్ ఇచ్చారు. రెండు దేశాలు అణ్వాయుధ శక్తులని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు ఒప్పించడానికి చాలా ప్రయత్నాలు చేశామన్నారు. ఇందులో తన కృషి ఫలించిందని అన్నారు. అణు యుద్ధాల గురించి అమెరికా అధ్యక్షుడు చెప్పిన విషయాన్ని భారత్ ఖండించింది. అణ్వాయుధాలు ఉపయోగించాలన్న ఆలోచన భారత్‌కు ఎప్పుడూ లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈసారి కూడా 9 ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నట్టు వివరించాయి. కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని ఉన్నత వర్గాల తెలిపాయి. మీరు ఆగిపోతే మేం ఆగిపోతామని పాక్ DGMO అభ్యర్థనకు భారతదేశం అంగీకరించిందని తెలిపాయి.

# ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలి.

## - ఎమ్మెల్యే గండ్ర

**జయశంకర్ భూపాలపల్లి మే 13, ( వెలుతురు)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వైద్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. ఆస్పత్రిలో పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్సను అందించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ కు సూచించారు. అనంతరం ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత,



సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ తదితర విషయాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్మెల్యేకు వివరించారు. అట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సు దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి వెనకాల ఉన్న చిన్న పిల్లల విభాగాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# ఆనాడే పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలే

- మీడియా సమావేశంలో కాంగ్రెస్‌కు అసోం సీఎం ప్రశ్న




**గువాహటి, మే13( వెలుతురు):**
1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించినా.. పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేను ఎందుకు స్వాధీన పర్చుకోలేఓ కాంగ్రెస్ చెప్పాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మఅన్నారు. పాక్‌తో కాల్పుల విరమణ అంశంపై ప్రధాని మోదీని ప్రశ్నించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని హిమంత బిశ్వ శర్మఅన్నారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించినా.. పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేను తిరిగి వశపరచుకునేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనకాడిందని ప్రశ్నించారు. 'చికెన్ నెక్ ఆఫ్ ఇండియా'గా పిలిచే సిలిగుడి కారిడార్‌ను కనీసం 100 మైళ్ల మేర అయినా ఎందుకు విస్తరించలేకపోయారని ప్రశ్నించారు. గువాహటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. ఒకవేళ ఇందిరాగాంధీ బతికి ఉంటే ఇవే ప్రశ్నలు ఆమెనే అడిగేవాడినని అన్నారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైన్యం అఖండ విజయం సాధించింది. పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి గానీ, ఈశాన్య రాష్ట్రాలను మిగతా భారతదేశానికి కలిపే 'చికెన్ నెక్'ను విస్తరించేందుకుగానీ, అదే సరైన సమయం. ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ అప్పట్లో ఆ పని ఎందుకు చేయలేదన్నారు. వివిధ దేశాల సరిహద్దులకు దగ్గరగా ఉండే ఈ వ్యూహాత్మక ప్రాంతాలను అప్పుడే భారత్ అధీనంలోకి తీసుకోవాల్సిందని బిశ్వశర్మ అన్నారు. తాజాగా పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పేందుకు, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా నాశనం చేసేందుకే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టినట్లు- చెప్పారు. ఆ లక్ష్యం పూర్తయిందని, అందుకే పాక్‌తో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించిందని తెలిపారు. ఉగ్రవాదులకు వత్తాసు పలికిన పాక్ సైన్యానికి కూడా భారత్ ఆర్మీ తగిన రీతిలో బదులిచ్చిందని పేర్కొన్నారు. భారత్ శక్తి ముందు నిలవలేమని భావించిన పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇవన్నీ కనిపిస్తున్నా..మోడీని విమర్శించడం తగదన్నారు. వాస్తవాలు గుర్తించి మాట్లాడితే మంచిదన్నారు.

## ఉగ్రవాది అరెస్ట్ వార్త అబద్ధం

- సైబర్ సెక్యూరిటీ



**హైదరాబాద్, మే13( వెలుతురు):**
శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ఉగ్రవాది పట్టుబడినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సైబర్‌సెక్యూరిటీ ఖండించింది. ఇది ఫే÷– వార్త అని పేర్కొంది. ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుంటున్న వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే, దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్పష్టత ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ వీడియో అని ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిర్ధరించారు. ఇటీవల శంషాబాద్ ఎయిర్ పోర్టులో మాక్ డ్రిల్ సందర్భంగా తీసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు ధ్రువీకరించని నకిలీ వీడియోలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు వీడియోలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## రేపటినుంచి సిఫారసు లేఖలకు అనుమతి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి



**తిరుమల, మే13( వెలుతురు):**
తిరుమలలో గురువారం నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై 15 నుంచి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి అనునిత్యం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.. ఇక, సెలవు రోజుల్లో ఆ సంఖ్య మరింత భారీగా ఉంటుంది.. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా.. సిఫార్సు లేఖలపై శ్రీవారి బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. అయితే, తిరుమలలో భక్తుల రద్దీ సాదారణంగానే ఉంది.. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ తగ్గిన నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.. శ్రీవారి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలను తిరిగి స్వీకరించాలని నిర్ణయించింది. మే 15వ తేదీ నుంచి.. సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాలు కేటాయింపు పునః ప్రారంభించనున్నట్టు పేర్కొంది.. మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో తితిదే ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని వెల్లడించింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా తితిదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. ఆ గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

# మద్యం వ్యాపారుల నయా దందా...


- ఇష్టరాజ్యంగా వైన్స్ షాప్ ల నిర్వహణ
- సమయ పాలనకు మంగళం
- బెల్టుషాపులే ఫుల్లు.. వాటి కోసమే వైన్ షాప్ లు...
- అడ్డగోలుగా మద్యం విక్రయాలు
- ధనార్జనే ధ్యేయంగా దండుకుంటున్న వ్యాపారులు
- మామూలు'గా తీసుకుంటున్న అధికారులు
- తనిఖీలను మరచిన ఎక్సైజ్ అధికారులు
- వారి కనుసన్నలోనే మద్యం విక్రయాలు
- సామాజిక సేవకులు కర్నే బాబురావు



**భద్రాద్రి కొత్తగూడెం మే13( వెలుతురు):**
మణుగూరు మండలంలో బెల్టుషాపులకు అడ్డగోలుగా మద్యం విక్రయస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ వైన్‌షాప్ యజమానులు కొత్తరకం దందాకు తెరలేపారని సామాజిక సేవకులు కర్నె బాబురావు ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియా కు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నుండి మద్యం దుకాణాలను టెండర్ ద్వారా పొందిన మద్యం వ్యాపారులు వైన్ షాప్ లను సమయానుసరం తెరచి ఉంచకుండా కేవలం సాయంత్రం సమయంలో తెరిచి బెల్ట్‌షాప్‌ల ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధన మేరకు ప్రతి వైన్ షాప్ ఉదయం 10 నుండి సాయంత్రం 10 గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలి కానీ ఇవేమీ తమకు పట్టినట్టు వైన్ షాప్ నిర్వాహకులు షాపులకు వచ్చిన మద్యం నిల్వలను సామాన్య ప్రజలకు అందుబాటు లో లేకుండా కేవలం బెల్టు షాపులకు మాత్రమే పరిమితం చేస్తూజేబులు నింపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారునికి అందుబాటు లో ఉండవలసిన సమయంలో సైతం నిర్వాహకులు వైన్ షాపులకు తాళం వేసి ఉంచడంతో వైన్స్ కొనుగోలు చేయడానికి వచ్చిన వారందరూ తిరిగి బెల్టుషాపుల వైపు వెళ్తున్నారని ప్రత్యక్షంగా వైన్ షాప్ నిర్వాహకులే బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఒకవేళ వైన్ షాప్ తెరిచి ఉన్నా ప్రముఖ కంపెనీలకు చెందిన బీర్లు స్టాక్ లేదంటూ నిర్వాహకులు సమాధానం ఇస్తున్నారని, వైన్‌షాప్‌లో అమ్మ వలసిన బీర్లు అక్కడ దొరకకపోవడమే కాకుండా ఎక్కువ రేటుకు బెల్ట్ షాపుల్లో లభించడంతో చేసేదేమీలేక అధిక ధరలకు బెల్ట్‌షాప్‌లో మద్యం కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.సమయపలన పాటించని వైన్ షాపులపై తనిఖీలు నిర్వహించకుండా ఎక్సైజ్ అధికారులు శోధ్యం చూస్తున్నారని ధ్వజమేత్తరు.ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్ముతూ అందినకాడికి దండుకునెందుకు పోటీపడి వైన్‌షాపులను దక్కించుకున్న వ్యాపారులు దానిని తిరిగి రాబట్టుకునేందుకు ఇష్టరాజ్యంగా వైన్స్ షాప్ లను నిర్వహిస్తున్నారనీ, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే మద్యం వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నదన్నారు. మండలంలో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు ఉన్నాయంటే వారి అక్రమ మద్యం వ్యాపారాన్ని ఏరీతిలో సాగిస్తున్నారో అర్థమవు తుందన్నారు. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తోనే అడ్డగోలుగా మద్యం విక్రయాలు జరుపుతూ ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు దండుకుంటున్నారని బాబురావు విమర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకటిగా ఉన్న ఎక్సైజ్ శాఖ పినపాక నియోజకవర్గం లో అసలు పనిచేస్తుందా లేదా అన్న అనుమానాలకు దారి తీసేలా వారి పనితీరు ఉందన్నారు.బెల్ట్,వైన్స్ షాపుల్లో నిర్భయంగా అధిక ధరలతో లిక్కర్ అమ్మకాలు సాగిస్తుంటే ఎక్సైజ్ అధికారుల యంత్రాంగం మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం ఏమిటని, వారి మౌనం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. నియోజకవర్గం వ్యాప్తంగా మద్యం దందా జోరుగా సాగుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారులకు మాత్రం కానరాకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. కనీసం అధికారులు మద్యం దందా కట్టడిని మరిచారని,లిక్కర్ అక్రమ దందాను అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విషయం స్పష్టమవుతోందన్నారు. జిల్లా స్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులకు దిగకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఊరూరా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని, గుడుంబా తయారీదారులను నియంత్రించేందుకంటూ కాలం పొద్దుపుచ్చే విధులు, విధానాలు అనేఎక్సైజ్ అధికారులు మద్యం దందా ను కూడ నియంత్రించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మండలంలోజరుగుతున్న మద్యం నయా దందాపై దృష్టి పెట్టి, మద్యం దందా ను కట్టడి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, వైన్ షాపులు సమయ పాలన పాటించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిచో ఈ అక్రమ మద్యం విక్రయాలు, సమయ పాలన పాటించని వైన్ షాపులపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

# బలోచిస్తాన్ చరిత్ర ఏంటి ?

## ప్రత్యేక దేశాన్ని బలోచిస్థాన్ ప్రజలు ఎందుకు కోరుకుంటున్నారు ?




**హైదరాబాద్,మే13( వెలుతురు):**
పహల్గాం దాడి తర్వాత ఇండియా పాకిస్థాన్ పై విజయవంతంగా దాడులు ఉగ్రవాద శిబిరాలను, ఉగ్రవాద కేంద్రాలను , ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఇది జరిగిన తర్వాత పాక్ భారత్ పై డ్రోన్లు, యుద్ధ విమానాలు, క్షిపణులతో దాడులకు పాల్పడేందుకు సిద్ధమయింది. అయితే మన ఆర్మీ ఆ ప్రయత్నాలను నిర్వీర్యం చేసి విజయం సాధించింది. ఈ తరుణంలో బలుచిస్తాన్ ఆర్మీ పాక్ పై దాడులకు పాల్పడింది. బలుచిస్థాన్ ప్రాంతం తమ ఆధీనంలోకి వచ్చిందని ప్రకటించుకుంది. అయితే అసలు బలుచిస్థాన్ చరిత్ర ఏంటి. ఏందుకు వారు ప్రత్యేక దేశం కోరుకుంటున్నారో తెలుసుకుందాం.

**బలోచిస్థాన్ పేరుకు అర్థం ఏంటంటే...?**
బలోచిస్థాన్ అనే పదం బలుచ్ , స్థాన్ అనే రెండు పదాల కలయికతో ఏర్పడింది. బలుచ్ అనేది ఆ ప్రాంతంలో నివసించే ప్రజల్ని సూచిస్తుంది. వీరు ఇండో – ఇరాన్ మూలాలు కలిగి ఉన్న గిరిజనులు. వీరు బలోచి భాషను మాట్లాడతారు. బలో అంటే బల్ అంటే బలోచ్ ప్రజలను ఓచ్ అంటే పాత ఇరానియన్ భాష ప్రకారం జాతి లేదా సమూహం అనే అర్థం వస్తుంది. ఇస్తాన్ అనేది పర్షియన్ పదం. అంటే ప్రత్యేక ప్రాంతం లేదా దేశం అనే అర్థం వస్తుంది. బలోచిస్తాన్ అంటే పాకిస్థాన్ లాగా బలూచ్ ప్రజలు నివసించే దేశం అనే అర్థం వస్తుంది.

**బలోచిస్థాన్ చరిత్ర లోకి వెళ్తే...**
బలోచిస్థాన్ చరిత్రలోకి వెళ్తే 1839లో బ్రిటిష్ సైన్యం కలత్ పై దాడి చేసింది. కలత్ అంటే ఇప్పుడు బలోచిస్థాన్ ప్రాంతాన్నే నాడు కలత్ గా పిలిచేవారు. కలత్ ను మీర్ మెహ్రాబ్ ఖాన్ అహ్మద్ జాయ్ 1817 నుండి 1839 వరకు పాలించారు. బ్రిటీష్ వారు అఫ్ఘనిస్తాన్ పై దాడి చేసినప్పుడు కలత్ రాజు మీర్ మెహ్రాబ్ ఖాన్ అందుకు ఆంగ్లేయులకు సహకరించలేదు. ఈ కారణంగా 1839 లో కలత్ పై బ్రిటీషర్లు దాడి చేసి మెహ్రాబ్ ఖాన్ ను చంపివేశారు. స్థానిక గిరిజన సర్థార్ నాయకులతో ఈ ప్రాంతాన్ని ఆంగ్లేయ పాలకులు తమ అదుపులో పెట్టుకున్నరు. ఇది బలోచ్ గిరిజన ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. ఈ కారణంగా తరచూ ఆంగ్లేయులపై వీరు తిరుగుబాటు చేసే రు. 1920ల నాటికి బలోచ్ జాతీయవాదానికి అంకురార్పణ జరిగింది. ప్రజల్లో తీవ్ర స్వాంతంత్ర కాంక్ష పెరిగింది.

1929లో అంజుమన్ – ఎ– ఇత్తెహాద్ – ఎ– బలోచిస్తాన్ అనే సంస్థ పురుడు పోసుకుంది. ఈ సంస్థ బలోచ్ సంస్కృతిని కాపాడటం, కలోత్ రాజ్య స్వతంత్ర కోసం అంటే బలోచిస్థాన్ ఏర్పాటు డిమాండ్ లక్ష్యంగా పని చేయడం ప్రారంభించింది. వలస రాజ్యాలకు స్వాతంత్రం ఇచ్చే సమయానికి అంటే భారత దేశ విభజన సమయానికి కలత్ రాజ్యం మీర్ అహ్మద్ యార్ ఖాన్ నాయకత్వంలో స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. సాక్షాత్తు పాకిస్థాన్ పితగా చెప్పుకునే మహమ్మద్ అలీ జిన్నా ఈ డిమాండ్ కు మద్ధతు ఇవ్వడం గమనార్హం. కలత్ స్వతంత్రతను ముస్లింలీగ్ గౌరవిస్తుందని 1947 ఆగష్టు 11వ తేదీన ఇరువురు నేతల మధ్య ఒప్పందం కుదిరింది. కాని పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని తుంగలో తొక్కి 1948 మార్చి 27వ తేదీన తమ సైన్యంతో కలత్ ను బలవంతంగా ఆక్రమించుకుంది. విలీన ఒప్పందంపై సంతకం చేయాలని కలత్ నేతలపై ఒత్తిడి ప్రారంభించింది. దీంతో కలత్ భారతదేశంలో కలిసేందుకు సిద్ధమవుతోందని అయితే బౌగోళిక పరిస్థితుల దృష్ట్యా సాధ్యం కాదని భారత దేశ నాటి ప్రధాని నెహ్రూ తిరస్కరించారన్న వార్తలు వచ్చాయి.

మహమ్మద్ ఆలీ జిన్నా సూచన మేరకు 1948 లో సైనిక చర్య చేపట్టి బలవంతంగా మీర్ అహ్మద్ యార్ ఖాన్ ను కరాచి తీసుకెవెళ్లి పాకిస్తాన్ లో విలీనం అయినట్లు సంతంకం పెట్టించారు. దీన్ని బలోచ్ ప్రజలు , ప్రిన్స్ అబ్దుల్ కరీం తిరస్కరించి 1948లో గెరిల్లా దాడులకు దిగి తిరుగుబాటు చేశారు. అయితే పాక్ సైన్యం ఈ తిరుగుబాటును అణిచి వేసి కరీంను జైల్లో పెట్టింది.

**అలుపెరుగకుండా పాక్ పై తిరుగుబాట్లు చేస్తోన్న బలోచిస్థాన్ వాదులు**
పాక్ పై పైన చెప్పుకున్నట్లు తొలి తిరుగుబాటుకు 1948లో ప్రిన్స్ అబ్దుల్ కరీం నేతృత్వం వహించారు. ఆయన అరెస్టు తర్వాత 1958–59 కాలంలో నౌషేరా ఖాన్ నాయకత్వంలో మరో తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకు కారణం బలోచిస్తాన్ లో పాక్ సైన్యం చేస్తోన్న ఆకృత్యాలు, ఆధిపత్య ధోరణికి, రాజకీయ నేతలపై ఉక్కుపాదం మోపడం వంటి చర్యలను వ్యతిరేకిస్తూ జరిగింది. ఆ తర్వాత 1963 నుండి 1969 వరకు బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ తిరుగుబాటుకు నాయకత్వం వహించింది.

పాక్ జైళ్లలో ఉన్న బలోచిస్థాన్ ఖైదీల విడుదల, బలోచ్ లోని గ్యాస్ సహా ఇతర వనరుల విషయంలో సమాన వాటా ఇవ్వాలని , వన్ యూనిట్ విధానం రద్దును డిమాండ్ చేస్తూ అంటే బలోచిస్థాన్, సింధ్, ఖైబర్ ఫఖ్తూన్ ఖ్వా, అప్పటి తూర్పు పాకిస్థాన్, పంజాబ్ రాష్ట్రాలను కలిపివేసి కేంద్రపాలన ఏర్పాటు చేయాలని 1955 నుండి 1970 వరకు పాక్ పాలకులు వన్ యూనిట్ విధానం కోసం ఆలోచన చేశారు. దీన్ని అన్ని రాష్ట్రాల వారు తమ సంస్కృతి, భాష, సంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోతాయని విభేదించారు. చివరకు 1970లో ఇది రద్దు చేయడం జరిగింది. ఈ డిమాండ్లపై బీఎల్ఎఫ్ పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసింది. దీనికి షేర్ మహమ్మద్ బిజ్రానీ మర్రీ నాయకత్వం వహించారు. ఇతను పరారీ అనే గెరిల్లా యుద్ధ సంస్థను ఏర్పాటు చేసి పాక్ సైన్యంపై దాడులు చేశారు. చివరకు 1969 పాక్ సైన్యం– బీఎల్ఎఫ్ ల మధ్య కాల్పుల విరమణ జరిగింది. వన్ యూనిట్ విధానం రద్దు అయింది. ఈ గెరిల్లా వార్ లో పాల్గొన్న తిరుగుబాటు దారులకు పాక్ ప్రభుత్వం క్షమా బిక్ష ప్రకటించింది. ఆ తర్వాత 1973–77 కాలంలో తీవ్రమైన స్తాయిలో తిరుగుబాటు జరిగింది. దీనికి ఖైర్ బక్ష్ మారీ, అతాఉల్లా మెంగల్ వంటి స్థానిక గిరిజన సర్థార్ లు నాయకత్వం వహించారు. ఇందుకు ప్రధాన కారణం జుల్ఫికర్ ఆలీ భుట్టో ప్రభుత్వం బలోచిస్తాన్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది. ఇరాక్ నుండి బలోచ్ వాదులకు ఆయుధాలు అందుతున్నాయని వారిపై సైనిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 80 వేల సైనికులు పాల్గొన్నారంటే బలోచ్ తిరుగుబాటు ఎంత పెద్ద స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ దాడుల్లో బలోచ్ వాదులు ఏడు వేల నుండి పది వేల మంది మరణించినట్లు చెప్తారు. అదే రీతిలోపాక్ సైన్యంలోను మూడు నుండి ఐదు వేల మంది మరణించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత జియా ఉల్ హక్ జుల్ఫికర్ ఆలీ భుట్టోను సైనిక చర్య ద్వారా దింపి అధికారంలోకి రావడంతో ఈ సమస్యను రాజకీయంగా పరిష్కరించడానికి సిద్ధపడటం, బలోచ్ నాయకులు ఆఫ్ఘాన్ లో శరణార్థులుగా వెళ్లడంతో ఈ తిరుగుబాటు ముగిసింది. ఇక ఆ తర్వాతి తిరుగుబాటు ప్రస్తుత పరిస్థితులకు దారి తీసిన తిరుగుబాటుగా చరిత్రకారులు చెబుతారు.

2006లో నవాబ్ అక్బర్ బుగ్టి హత్యతో బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పెద్ద ఎత్తున తిరుగుబాటు లేవదీసింది. బలోచిస్థాన్ లో జనరల్ ముషారఫ్ సైనిక స్థావరాలు పెంచడం, చైనా పాక్ ఆర్థిక కారిడార్ సీపెక్ ప్రాజెక్టును ప్రారంబించడం వంటి చర్యలు బలోచిస్థాన్ ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసాయి. తమ వనరులు కొల్లగొడుతున్నారని, తమకు సరైన వాటా రావడం లేదని, పంజాబీల ప్రాబల్యం పెరుగుతుందన్న కారణాలతో బలోచీవాదులు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు సీపెక్ ప్రాజెక్టుల్లో బలోచిస్థానేతరులకు ఉపాధి కల్పించడం వంటివి చర్యలు ఆగ్రహాన్ని తెప్పించాయి. అయితే దీన్ని వ్యతిరేకించిన మాజీ ముఖ్యమంత్రి , గవర్నర్ గా పని చేసిన నవాబ్ అక్బర్ బుగ్టి హత్య కావడం ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇతను వనరుల్లో సమాన వాటాను డిమాండ్ చేశారు. అంతే కాకుండా గ్వాదర్ పోర్టు నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అతని హత్య బలోచిస్థాన్ ఉద్యమాన్ని మరో ఎత్తుకు తీసుకెళ్లింది.

**బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఏర్పాటు ?**
బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ 2000 దశకంలో ఏర్పాటు అయింది. ఇది సాయుధ గెరిల్లా యుద్ధ నైపుణ్యం కలిగిన సంస్థగా దీన్ని రూపొందించారు. 1973 -77 కాలంలో బలోచిస్థాన్ తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన ఖైబర్ బక్ష్ మర్రీ కుమారుడు మీర్ బలచ్ మర్రీ ఈ బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఓ రకంగా చెప్పాలంటే ఇతని తండ్రి ఖైబర్ బక్ష్ మర్రీ బలోచీల జాతీయవాద ఉద్యమానికి ఓ ముఖ్య ప్రేరణగా నిలిచారు. అతని కూమారుడి సారథ్యంలో ఈ బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ స్వయం పరిపాలన, ప్రత్యేక దేశం అనే డిమాండ్ తో పురుడు పోసుకుంది. ఈ సంస్థ ఆధునిక గెరిల్లా యుద్ధ తంత్రాలను పుణికిపుచ్చుకుంది. జనరల్ ముషారఫ్ సైనిక చర్యలు, బలోచ్ ప్రాంతంలో సైనిక స్థావరాలు ఏర్పాటు కావడం, బలోచ్ నేతలు, కార్యకర్తలు అదృశ్యం కావడం, హత్యలు కావించబడటం , పాక్ – చైనా ఆర్థిక కారిడార్ సీపెక్ లో భాగంగా గ్వాదర్ పోర్టు నిర్మాణం, గ్యాస్, గోల్డ్ వంటి సహజవనరులు తరలించడం, వీటిని ఖండిస్తున్న నవాబ్ అక్బర్ బుగ్టి హత్య తో బీఎల్ ఏ సంస్థ తన ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది.

పాక్ సైన్యం పైన, చైనా ప్రాజెక్టులపైన దాడులకు బీఎల్ ఏ దిగింది. ఇలా అంతర్జాతీయంగా బీఎల్ఏ బలోచిస్థాన్ దేశం ఏర్పాటు పై తన పోరాటం చేస్తూనే ఉంది. అవకాశం చిక్కినప్పుడల్లా పాక్ సైన్యం పైన, పాకిస్థాన్ లో బాంబులు పేల్చుడం వంటి చర్యలతో తమ డిమాండ్ అంతర్జాతీయంగా చర్చ జరిగేలా పోరాటం చేస్తూనే ఉంది. ఈ సంస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మీర్ బలచ్ మర్రీ 2007లో నాటో దాడుల్లో మరణించారు. ఆ తర్వాత ఈ సంస్థను బషీర్ జెబ్ నడిపిస్తున్నారు. ఇది బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ కథాకమామీషు.

## నాటు తుపాకీ పేలి ముగ్గరికి గాయాలు

**ఏలూరు,మే13( వెలుతురు):**
ఏలూరు జిల్లా కైకలూరు మండలం రామవరంలో నాటు తుపాకీ మందు పేలి ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంట్లో నాటు తుపాకీలో ఉపయోగించే మందు తయారు చేస్తుండగా సామగ్రి పేలింది. ప్రమాదంలో చరణ్, సతీష్, మణి అనే ముగ్గురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. పక్షులను బెదిరించడానికి నాటు తుపాకీ మందు తయారు చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు- తెలుస్తోంది.

## ఎపి భవన్ బాలాజీ మందిరం సేఫ్


- కూల్చివేతను ఆపాలని సిఎం ఆదేశం




**న్యూఢిల్లీ,మే13( వెలుతురు):**
ఢిల్లీ ఏపీ భవన్‌లో బాలాజీ మందిరం కూల్చివేతను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అదికారులను ఆదేశించారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు, ప్రార్థనా మందిరం తొలగింపు ప్రతిపాదన అంశంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీ భవన్ స్థలాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పంచుకున్నాయి. ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలను ఏపీ యంత్రాంగం చేపట్టింది. ఏపీ భవన్ ప్రాంగణంలో 0.37 ఎకరాల్లో పలు ఆక్రమణలు ఉన్నట్లు- అధికారులు తేల్చారు. వాటి తొలగింపునకు సంప్రదింపుల ద్వారా, చట్టబద్ధంగా గత నెల నుంచి తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు- అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించే పక్రియ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రజల, మత సంస్థల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అక్కడ స్థానికులు ఏర్పాటు- చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులను సీఎం చంద్రబాబు వివరణ కోరారు. ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ముఖ్యమంత్రి సూచనలతో నిన్ననే నిర్మాణాల తొలగింపు పక్రియను నిలిపివేశామని అధికారులు చెప్పారు. ఆయా మతాలకు చెందిన వారి అభిప్రాయలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## సెల్‌ఫోన్ మట్లాడుతూ పట్టాలు దాటే యత్నం

- రైలు ఢీకొనడంతో ఇద్దరు యువకుల దుర్మరణం




**చెన్నై,మే13( వెలుతురు):**
సెల్‌ఫోన్ ,ఏతిలో ఉంటే పరిసరాలను గమనించలేనంతగా మైమరిచిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా సెల్ ఫోన్.. ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఆ ఇద్దరూ రైలు ఢీకొని మృతి చెందారు. చెన్నైలోని స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లో ఈ ఘటన జరిగింది. పెరంబలూరుకు చెందిన మహమ్మద్ నఫూల్ (20), సబీర్ అహ్మద్ (20)లు థామస్ మౌంట్ సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. థామస్ మౌంట్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఇద్దరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటు-తున్నారు. అదే సమయంలో ఎగ్మూరు నుంచి తాంబరం వైపు వెళ్తున్న సబర్బన్ రైలు దూసుకొచ్చింది. రైలు డ్రైవర్ ఎన్నిసార్లు హారన్ మోగించినా.. స్ధానికులు కేకలు వేస్తున్నా యువకులు పట్టించుకోలేదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలపైకి వచ్చేశారు. ఇద్దరినీ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. యువకుల మృతదేహాలను స్ధానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహమ్మద్ నఫూల్, సబీర్ అహ్మద్ కలిసి ఆడంబాక్కంలోని ఒక హాస్టల్‌లో ఉన్నారు. ఇద్దరిలో ఒకరు కంప్యూటర్ సైన్స్. మరొకరు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం సాయంత్రం వారిద్దరూ సెయింట్ థామస్ మౌంట్ రైల్వే స్టేషన్ సమీపంలోని మైదానంలో క్రికెట్ ఆడటానికి వెళ్లారు. రాత్రి ఇద్దరు హాస్టల్‌కు తిరిగి రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా.. ఈ ఘటన జరిగింది.

## పంజాబ్‌లో కల్తీ మద్యానికి 15మంది బలి



**చండీఘడ్,మే13( వెలుతురు):**
అమృత్‌సర్‌లోని మజితా ప్రాంతంలో కల్తీ మద్యం సేవించి 15 మంది మరణించగా, మరో ఆరుగురు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై అమృత్‌సర్ ఎస్‌ఎస్పీ మనీందర్ సింగ్ మాట్లాడుతూ.. మజితాలో సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కల్తీ మద్యం సేవించి ప్రజలు చనిపోతున్నారని మాకు సమాచారం అందింది. మేము వెంటనే చర్యలు తీసుకుని నలుగురిని అరెస్టు చేశాం. ప్రధాన సరఫరాదారు ప్రబ్జీత్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారణ సమయంలో ప్రబ్జీత్ సింగ్.. కింగ్‌పిన్ సరఫరాదారు సహబ్ సింగ్ పేరు చెప్పాడు. అతన్ని కూడా అదుపులోకి తీసున్నామని.. ఈ మద్యాన్ని ఎవరి నుండి కొనుగోలు చేశాడో అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాము. ఈ విషాద సంఘటన తర్వాత కల్తీ మద్యం సరఫరా, తయారీలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంజాబ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. తయారీదారుల కోసం పోలీసులు అనుమానిత ప్రదేశాలపై దాడులు చేస్తున్నారు.

# దేశంలో తుర్కియా వ్యతిరేక నినాదం

- ఆ దేశ యాపిల్ల అమ్మకాలపై నిషేధం

**పుణె,మే13( వెలుతురు):**
పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించడం పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోంది. దీంతో టర్కీ ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు- నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు. పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా.




దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటున్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ టర్కీ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు- వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా దేశంలో నిరసనలు వస్తున్నాయి. తుర్కియా వస్తువును బహిష్కరించాలన్న పిలుపు ఊపందుకుంది.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు నష్టం

**ముంబయి,మే13( వెలుతురు):**
భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో సోమవారం దూసుకెళ్లిన భారత్ సూచీలు.. మంగళవారం భారీ నష్టాలు చవిచూశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు- క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ- స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీ-సీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది. సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ




పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీ-సీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్‌ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ- షేర్లు మాత్రమే. రి-టైల్, హెచ్‌ఎన్‌ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# రక్తదానం మానవత్వానికి మరో రూపం..

- రక్తదానంపై యువతలో చైన్యం రావాలి..
- సమాజంలో ఉన్న అపోహలను తొలగిద్దాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**విజయవాడ,మే13( వెలుతురు):**
రక్తదానం మానవత్వానికి మరో రూపమని ప్రాణాపాయి స్థితిలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించడం ప్రాణాలను కాపాడడం మరో జన్మనివ్వడమేనని, రక్తదానం చేయడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని సమాజంలో ఉన్న అపోహలను తొలగించి రక్తదానానికి ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం అభినందనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక సూర్యరావు పేట నక్కలరోడ్డులోని శ్రీధర్ కోచింగ్ సెంటర్ నందు మంగళవారం నిర్వహించిన మోగా రక్తదానం శిభిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రక్తదానం చేయడం మానవత్వానికి మరో రూపంగా భావించాలన్నారు. ప్రాణాపాయి స్థితిలో ఉన్నప్పడు సకాలంలో రక్తం లభించకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే ఒక మానవతావాది రక్తంలో ఉండే గ్రూపులను వర్గీకరించి ఉండకపోతే ప్రపంచంలో ఇప్పటికీ రక్తమార్పిడి కారణంగా మరణాలు సంభవించేవన్నారు. రాష్ట్రంలో అనేక మంది రక్త హీనతతో భాదపడుతున్నారని సుమారు 6 వేల మందికి పైగా తలసీమియా వ్యాధికి గురి కావడం జరిగిందని వీరి



ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్త మార్పిండి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం అనేది ప్రాణదానం లాంటిద అన్నారు. ప్రమాదానికి గురి అయినప్పుడు, అత్యవసర శస్త్ర చికిత్సల సమయంలో రక్త అవసరం వుంటు-ందన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చునని ఉత్పత్తి చేయలేమన్నారు. రక్త అవసరమయ్యే జీవితాలకు రక్తదాతలే ప్రాణదాతలన్నారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చునని, జీవిత కాలంలో ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో నీరసించి పోతామనే అపోహను తొలగించి రక్తదానం చేసిన ప్రతీ సారి ఆరోగ్యవంతమైన కొత్త రక్తాన్ని పొందగలుగుతామనే విషయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లి రక్తదానం వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. కొత్త యువత కూడా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలలో పాల్గొనేలా స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో పోటీ-పరీక్షలకు యువతను సన్నద్దులను చేయడంతో పాటు- సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మోగా రక్తదానం శిభిరాలను ఏర్పాటు- చేసిన శ్రీధర్ కోచింగ్ సెంటర్ నిర్వహాలను అభినందిస్తున్నానన్నారు. దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమన్నారు. యువతలో మెదోశక్తిని పెంపొందించి వారిని అన్ని రంగాలలో అగ్రగామిగా నిల్వాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు- మెరుగైన ఉపాధి అవకాశాలను చర్యలు తీసుకుంటు-ందని వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కొమ్మూరి శ్రీధర్, సీతారామిరెడ్డి, డా. మధన్ మోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణలో అలసత్వం తగదు

- దత్తతలను చట్టబద్ధంగానే చేపట్టాలి
- బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యురాలు

**విజయవాడ,మే13( వెలుతురు):**
బాలల పరిరక్షణ కార్యక్రమలలో బాలల సంరక్షణ కేంద్రాలు అలసత్యం వహిస్తే సహించేదిలేదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అమలుచేస్తున్న మిషన్ వాత్సల్య మరియు మిషన్ శక్తి స్కీమ్ లపై ప్రాజెక్ట్ డైరెక్టర్ డి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పిల్లల దత్తత లీగల్ గా జరగాలి. బాల్య వివాహాలు నిషేదించటంలో సంబంధిత అధికారులను భాగ్యస్వాములను చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించలని సూచించారు. లైంగిక బాధితులకు పరిహారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మరియు ఎయిడ్స్ వ్యాధిగ్రాస్తుల పిల్లలకు



మిషన్ వాత్సల్య గైడెన్స్ ఆధారంగా ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. లైసెన్స్ అర్హత కలిగిన బాలల సంరక్షణ కేంద్రాలు మాత్రమే నడపాలని డీపీవో ను ఆదేశించారు. రిజిస్టర్లు,డాకుమెంటేషన్, రికార్డులు భద్రపర్చు కోవాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బాలల సంరక్షణ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఐ సి పి, ఎస్ ఐ ఆర్, కేస్ స్టడీ రిపోర్టులు చేయాలని డీసీపీయు సిబ్బందిని ఆదేశించారు. రిస్క్యూ చేసిన బాలలకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ- ఆర్డలు తప్పనిసరిగా ఉండాలిని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీ రాజేశ్వరరావు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమం లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ- ఛైర్పర్సన్ సువార్త, రవి భార్గవ్,డీపీఓ జ్యోతి, సీడీపీఓ లు మంగమ్మ, జోష్న, పుష్పలత, సత్యవతి, కృష్ణ కుమారి, లక్ష్మి భార్గవి, డీసీపీయు, ఓ ఎస్ సి, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, శిశు గృహ, బాల సదన్, బాలల సంరక్షణ కేంద్రాల సిబ్బంది తదితరుల హాజరయ్యారు.

# కాలేజీ డేస్‌లోనే మహేశ్ బాబు తెలుసు: త్రిష



కాలేజ్ డేస్ నుండే మహేష్ బాబుతో త్రిష పరిచయయముందంట. సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రిష జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జోడికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉంటుంది. వీరిద్దరు అతడు సినిమాలో నటించగా, అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికి కూడా ఈ సినిమా టీవీలో వేస్తే చాలు ఎంతోమంది చూస్తూ ఉంటారు. ఒక రకంగా టీవీలో బ్లాక్ బస్టర్ సినిమా ఏది అంటే అతడు అనే అంటారు అందరూ. మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన ఈ సినిమా థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన బుల్లి తెరపై మాత్రం మంచి విజయం సాధించింది. ముఖ్యంగా ఈ చిత్రంలో త్రిష, మహేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బావ ప్రేమకోసం ఎదురుచూసే పల్లెటూరి అమ్మాయిగా త్రిష పాత్రలో ఒదిగిపోయింది. ఇక మహేష్ బాబు కూడా కాస్త యాటిట్యూడ్ ప్రదర్శిస్తూ సీరియస్‌గా చాలా అద్భుతంగా నటించారు. వారిద్దరి పాత్రలకి ప్రేక్షకులు ఇట్టే కనెక్ట్ అయ్యారు. అతడు తర్వాత త్రిష మహేష్ బాబు కలిసి సైనికుడు సినిమా చేశారు. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ తర్వాత త్రిష, మహేష్ బాబు కలిసి నటించలేదు. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి త్రిష ఆసక్తికర కామెంట్స్ చేసింది. మహేష్ బాబు తన ఫేవరెట్ హీరోల్లో ఒకరు అని చెప్పిన ఈ ముద్దుగుమ్మ .. మహేష్ బాబు సెట్ లో చాలా సరదాగా ఉంటాడని, చాలా హార్డ్ వర్క్ చేస్తాడు అని పేర్కొంది.. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కూడా అందరిని చాలా గౌరవిస్తాడు. అసలు కారవాన్ లోకి కూడా వెళ్లడు. తన షూటింగ్ అయిపోయినా కూడా .. మానిటర్ దగ్గర కూర్చొని ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉంటారు.. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే మహేష్ బాబు నాకు చాలా కాలం నుంచి తెలుసు. మేము ఇద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాము. మా ఇద్దరికి మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండేవారు. వారి వల్ల మహేష్ తో పరిచయం ఏర్పడింది. ఆ టైం లో మేము యాక్టర్స్ అవుతామని ఊహించలేదు. అప్పుడు హాయ్, బాయ్ ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేది అని త్రిష పేర్కొంది. ఇక ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తెలుగులో చిరంజీవితో విశ్వంభర చేస్తుంది.

## బిస్లరీ వాటర్‌తో స్నానం చేసిన నటి శ్రీవిద్య

ఎవరి సమయంలో వారు బెట్టుగా ఉంటారు. నిర్మాతలను ఓ ఆటాడుకుంటారు. అలాంటి ఘటనే శ్రీవిద్య విషయంలోనూ జరిగిందట.కొంత మంది హీరోయిన్‌లు చాలా డిమాండింగ్‌గా ఉంటారు. నిర్మాతలను నానా రకాలుగా ఇబ్బంది పెడుతూ ఉంటారు. ఇందులో భాగంగా తాజాగా ఓ హీరోయిన్ సంబంధించిన వార్త ఒకటి వైరల్ అవుతుంది. ఆమె స్నానానికి కూడా బిస్లరీ వాటర్ కావాలని డిమాండ్ చేసిందట. నటి శ్రీవిద్య.. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఆమె తన యాక్టింగ్ తో సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 800కి పైగా సినిమాల్లో నటించిన ఆమె, నటనతో పాటు- పాటలు పాడడంలోనూ, డబ్బింగ్‌లోనూ తన ప్రతిభను చాటారు. చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి హీరోయిన్‌గా.. అటు-పై సపోర్టింగ్ రోల్స్ చేస్తూ అమ్మ, అక్క, చెల్లి, అత్త వంటి క్యారెక్టర్లతో అలరించారు. ఆమె పండించే భావోద్వేగాలకు ప్రేక్షకులు ఫిదా అయిపోయేవారు. అయితే ఓ తెలుగు సినిమా షూటింగ్ సమయంలో రాజమహేంద్రవరం వద్ద గోదావరి నీటితో స్నానం చేయాలంటే గ్లామర్ దెబ్బతింటు-ందని, తనకు కచ్చితంగా బిస్లరీ నీరు తెప్పించాలని పంతం పట్టిందట. అప్పట్లో లీటర్ బాటిల్ రూ.6. దీంతో తప్పేది లేక రెండు బకెట్ల బిస్లరీ నీటిని తెప్పిస్తే అప్పుడు ఆమె స్నానం చేశారట.



## నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కూలీ

### ముందు అనుకున్న స్టోరీ వేరన్న లోకేశ్ కనగరాజు



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ క్రమంలో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. రజనీకాంత్‌కు తొలుత వేరే కథ చెప్పానని, అది ఆయనకు నచ్చినా అనుకోని కారణాలతో ఈ కథను పక్కన పెట్టినట్లు- తెలిపారు.రజనీకాంత్ సర్‌తో సినిమా చేయాలనుకున్నప్పుడు ఆయన్ను కలిసి ఒక కథ చెప్పాను. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు నెలలకు పైగా ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ఆ కథ, దాని నేపథ్యం రజనీ సర్‌కు బాగా నచ్చాయి. రెండు నెలల తర్వాత మళ్లీ ఆయన్ను కలిసినప్పుడు 'ఈ కథ వద్దు. మరొక స్టోరీ చేద్దాం' అని అన్నాను. అదే 'కూలీ'. రజనీ సర్‌కు ఆ స్టోరీ నచ్చినా నేను చేయకపోవడానికి ఒక కారణం ఉంది. నేను అనుకున్న పాయింట్ ఒక చోట పూర్తిగా డౌన్ అయిపోయినట్లు- అనిపించింది. దీంతో ఆ ప్రాజెక్ట్‌పై ఆసక్తి సన్నగిల్లిపోయింది. భవిష్యత్‌లో ఎప్పుడైనా కొత్త ఆలోచన వస్తే, ఆ కథను అందుకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తా. అంతేకానీ, అదే కథను పట్టుకుని రజనీ సర్ విలువైన సమయాన్ని వృథా చేయటం నాకు ఇష్టం లేదని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' విషయానికొస్తే భారీ బడ్జెట్, భారీ తారాగణంతో లోకేశ్ దీన్ని తీర్చిదిద్దారు. ఐటమ్ సాంగ్‌లో పూజా హెగ్డే ఆడి పాడింది. ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారు. ఆగస్టు 14న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'కూలీ'ని విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ మూవీ తీసుకొస్తున్నారు. రజనీకాంత్ ఇందులో కూలీ నెంబర్ 1421గా దేవా పాత్రలో సందడి చేయనున్నారు. అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

## ముంబైలో సెకండ్ లుక్ టెస్ట్.. హెవీ మేకప్‌తో అల్లు అర్జున్ మల్టీపుల్ గెటప్స్

పుష్ప2 చిత్రంతో తన ఇమేజ్‌ని అమాంతం పెంచుకున్న అల్లు అర్జున్ ఇప్పుడు అట్లీతో ఓ చిత్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ మూవీపై అంచనాలు భారీగా ఉన్నాయి. అల్లు అర్జున్ బర్త్ డే రోజు ఈ చిత్రాన్ని అధికారకంగా ప్రకటిస్తూ..చిత్ర బృందం ఒక వీడియో రిలీజ్ చేసింది. ఆ వీడియోతో ఈ చిత్రం ఏ స్థాయిలో నిర్మాణం జరుపుకుంటుందో మనకి అర్థమవుతుంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మ అనే కాన్సెప్ట్ తో ఈ చిత్ర కథ ఉండబోతోందనే టాక్ నడుస్తుంది. అల్లు అర్జున్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ పై అగ్ర నిర్మాత కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. జులై చివరి వారం లేదా ఆగస్టు ఫస్ట్ వీక్ లో షూట్ కి వెళ్లే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తుంది. పుష్ప సిరీస్ విజయం తరవాత ఆయనకు దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్‌ను తెచ్చిపెట్టగా, తాజా చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే అల్లు అర్జున్ ముంబయిలోని మెహబూబ్ స్టూడియోలో లుక్ టెస్ట్ నిర్వహించారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి రెండో లుక్ టెస్ట్ కూడా జరగనుంది. ఈ పరీక్ష కూడా ముంబయిలోనే నిర్వహించనున్నారు. ఈ టెస్ట్‌లో అల్లు అర్జున్ లుక్స్‌ని ప్రయోగాత్మకంగా పరిశీలించబోతున్నట్టు తెలుస్తుంది. ఒక లుక్‌లో హెవీ ప్రోస్తెటిక్స్ మేకప్ ఉపయోగించనున్నట్లు సమాచారం. పాత్రకు తగ్గట్టు భిన్నమైన మేకోవర్‌లను ప్రయత్నిస్తూ నటనకు కొత్త ఒరవడి ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ లుక్ టెస్ట్‌లు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అట్లీ చిత్రం కోసం అల్లు అర్జున్ మల్టిపుల్ గెటప్పులలో కనిపించబోతున్నట్లు జోరుగా ప్రచారం నడుస్తుంది. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు రావల్సి ఉంది. అట్లీతో అల్లు అర్జున్ మొదటిసారి పనిచేయనుండటంతో ఇది అభిమానుల్లో పెద్ద అంచనాలు పెంచుతోంది. పార్లల్ యూనివర్స్ కాన్సెప్ట్ తో రూపొందుతున్న ఈ చిత్రం హాలీవుడ్ రేంజ్ లో ఉంటుందని టాక్.



## అమెజాన్ ప్రైమ్‌లోనూ యాడ్స్

ప్రముఖ ఓటిటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు షాక్ ఇవ్వబోతోంది. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇ-మెయిల్స్ పంపిస్తోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమితి సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్-ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది.

prime video

## జయం రవి,కెనిషాల మధ్య పెరిగిన బంధం

### భార్య ఆర్తి కామెంట్స్‌కు కెనీషా ఘాటు జవాబు

హీరో జయం రవి ఇంటి గురించి రోజుకో వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ముందు నుంచి సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ కి జయం రవి కి మధ్య రిలేషన్ ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. రీసెంట్‌గా ఓ పెళ్లికి వీరిద్దరు జంటగా హాజరవడంతో మరోసారి కోలీవుడ్ లో పుకార్లు మరింత పుంజుకున్నాయి. ఈ ఫోటో క్షణాల్లోనే సోషల్ మీడియా మొత్తం వైరల్ అవ్వడంతో ఇది చూసిన జయం రవి భార్య ఆర్తి సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసింది. 'మాకు చట్టరీత్య ఇంకా విడాకులు అవ్వలేదు, విడాకులు వచ్చేవరకు నేను ఆర్తి రవినే,18 సంవత్సరాలు నాతో కలిసి ఉన్న వ్యక్తి నన్ను ఇంట్లో నుండి గెంటేసి, పిల్లలను కూడా పట్టించుకోకుండా, వారి అవసరాలకు కావలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు' అంటూ షాకింగ్ పోస్ట్ చేసింది. అయితే ఈ మాటలపై తాజాగా సింగర్ కెనీషా రివర్స్ పంచ్ ఇచ్చింది.. ఎవరికీ లొంగని ఒక మగాడు.. ఏ మహిళతో అయితే ఆనందం ఉంటుందో ఆ మహిళ దగ్గరే ఉంటాడు. ఆ మహిళకే మనసు ఇస్తాడు. మౌనంగా ఉంటున్నాను కదా అని నన్ను లైట్ తీసుకోకు.. నా మౌనమే నా బలం' అంటూ ఆర్తికి పరోక్షంగా కొటేషన్‌తో కౌంటర్ ఇచ్చింది. దీంతో సింగర్ కెనీషా పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అంటే దీని అర్థం ఆర్తి దగ్గర ప్రశాంతత లేకపోవడం వల్లే కెనిషాకి జయం రవి దగ్గరై ఆమెకు మనసిచ్చాడని పూర్తిగా అర్థమవుతుంది అంటూ నెటిజన్ల కామెంట్లు పెడుతున్నారు.



## నన్ను భరిస్తున్నందుకు థ్యాంక్స్

### భార్యకు వెరైటీగా బ్రహ్మాజీ వెడ్డింగ్ యానివర్సరీ విషెస్



నటుడు బ్రహ్మాజీ టైమింగ్ సెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఆన్‌స్క్రీన్‌లోనే కాదు ఆఫ్‌స్క్రీన్‌లోను తెగ నవ్విస్తుంటాడు. ఈ మధ్య సోషల్ మీడియాలోను చాలా యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర విషయాలు పంచుతున్నాడు. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌కి సంబంధించిన ఇంట్రెస్టింగ్ విషయాలు కూడా షేర్ చేస్తున్నాడు. అయితే బ్రహ్మాజీ సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా తన ఫ్యామిలీకి తప్పక కొంత సమయం కేటాయిస్తుంటాడు. తన భార్యతో ప్రపంచ దేశాలు తిరగడం తనకు ఇష్టమని బ్రహ్మాజీ చెబుతుంటాడు. తాను సంపాదించిన డబ్బు అంతా కూడబెట్టడం గానీ, ఇన్వెస్ట్ చేయడం వంటిది చేయను. వాటితో ప్రపంచదేశాలు చుట్టి వస్తానని ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. బ్రహ్మాజీది ప్రేమ పెళ్లి. వారిద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆ ప్రేమ కథ గురించి కూడా బ్రహ్మాజీ ఇది వరకు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చాడు. అయితే తన భార్యతో కలిసి అన్ని దేశాలు తిరిగి రావడమే తనకు ఇష్టమని బ్రహ్మాజీ అంటుంటాడు. బ్రహ్మాజీ వెడ్డింగ్ డే కావడంతో తన భార్యకు వెడ్డింగ్ యానివర్సరీ అంటూ స్పెషల్‌గా విషెస్ అందించాడు. పెరుగన్నంలోకి ఆవకాయ్ లా.. పాలకు డెవిడోఫ్ కాఫీలా.. వోడ్కాకి జింజిర్ ఆలేలా.. నా జీవితానికి నవ్వుల్లా.. నన్ను భరిస్తున్నందుకు థాంక్స్.. హ్యాపీ యానివర్సరీ సస్వతి అంటూ బ్రహ్మాజీ పోస్ట్ పెట్టాడు. ఇది నెట్టింట వైరల్‌గా మారింది. బ్రహ్మాజీ సరదా మనిషే కాదు సీరియస్ కూడా. కొన్ని సార్లు ఆయన చేస ట్వీట్స్ వివాదాలకి కూడా దారి తీస్తుంటాయి. రీసెంట్‌గా బౌన్సర్ల వ్యవస్థ మీద స్పందించిన బ్రహ్మాజీ తనదైన శైలిలో చురకలు అంటించాడు. అయితే గతంలో మాదిరిగా బ్రహ్మాజీ పెద్దగా సినిమాలు చేయడం లేదు. పుష్ప2 లో తనదైన నటనతో అలరించాడు. ఇక బ్రహ్మాజీ తనయుడు సంజయ్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ- ఇవ్వగా, ఆయన చిన్నా చితకా ప్రాజెక్టులతో ఓ గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాడు.

# మద్యం కేసులో మరో కీలక పరిణామం

- మైసూరులో బాలాజీ గోవిందప్ప అరెస్ట్
- విజయవాడకు తరలించిన సిట్ అధికారులు



**విజయవాడ, మే13( వెలుతురు):**
ఏపీ లిక్కర్ స్కాం కేసులో మరొకరు అరెస్టు అయ్యారు. కీలక నిందితుడు బాలాజీ గోవిందప్పను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో మైసూరులో మంగళవారం ఉదయం గోవిందప్పను అరెస్ట్ చేసి.. విజయవాడకు తీసుకొస్తున్నారు. భారతీ సిమెంట్స్‌లో గోవిందప్ప డైరెక్టర్‌గా ఉన్నారు. లిక్కర్ స్కాం కేసులో అయన ఏ33గా ఉన్నారు. గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు డిస్మిస్ చేసింది. సుప్రీం కోర్టులో పిటిషన్ విచారణ దశలో ఉంది. ఏపీ లిక్కర్ స్కాం కేసులో విచారణకు హాజరుకావాలంటూ బాలాజీ గోవిందప్పతో పాటు- సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయ రెడ్డి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డికి 3 రోజుల క్రితం సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. విజయవాడ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయంలో గత ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని ముగ్గురిని ఆదేశించారు. అయితే వీరు ఆ నోటీసులను బేఖాతరు చేస్తూ.. విచారణకు డుమ్మా కొట్టారు. గోవిందప్ప మైసూరులో ఉన్నాడన్న పక్కా సమాచారంతో.. సిట్ అధికారులు అక్కడికి వెళ్లి ఈరోజు అరెస్ట్ చేశారు. గోవిందప్ప అరెస్టుతో లిక్కర్ కేసులో అరెస్టుల సంఖ్య ఐదుకి చేరింది. ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 గోవిందప్ప బాలాజీలను సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో నిందితులు పేర్కొన్నారు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వాళ్ల పేర్లు చేర్చినట్లు- మెమోలో సెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా వైఎస్ జగన్‌కు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితులు. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు- ధనుంజయరెడ్డి పాత్ర కీలకం. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారని సిట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు.

# చట్టాన్ని ఉల్లంఘించిన మేయర్

- సురేశ్ బాబుపై విచారణకు ఆదేశం



**కడప, మే13( వెలుతురు):**
కుటుంబ సభ్యులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించి మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించాడని కడప మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మేయర్ కుటుంబ సభ్యులకు చెందిన వర్ధిని కన్స్ట్రక్షన్స్ కంపెనీకి కాంట్రాక్టు పనులు అప్పగించిన అంశంపై కడప ఎమ్మెల్యే మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధిగా మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించిన అంశంలో నీపై ఎందుకు అనర్హత వేటు వేయకూడదో సమాధానం చెప్పాలంటూ మార్చి 28న కడప మేయర్ సురేష్ బాబుకు ప్రభుత్వం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. అయితే మేయర్ ఆ నోటీస్ పై హైకోర్టును ఆశ్రయించారు. రెండుసార్లు గడువు పెంచిన కోర్ట్ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎదుట హాజరై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు మేయర్ సురేష్ బాబు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎదుట హాజరు కానున్నారు. సురేష్ బాబు సంజాయిషీపై ప్రభుత్వం సంతృప్తి చెందకపోతే.. ఆయనపై అనర్హత వేసే అవకాశం ఉంది.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కూలీల ట్రాలీని ఢీకొన్న లారీ..ఐదుగురు దుర్మరణం
- ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి

**గుంటూరు, మే13( వెలుతురు):**
పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం వినుకొండ మండలం శివాపురం వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో ట్రాలీ.. లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు చనిపోయారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నుంచి వ్యవసాయ కూలీలను వినుకొండకు తీసుకొస్తుండగా ప్రమాదం జరిగింది. మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన గ్రామస్తులు, స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. కూలీల కుటుంబాలు కడు పేదరికంతో బాధపడుతున్నాయి. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది. కుటుంబ సభ్యులు మృతిచెందడంతో ఆయా కుటుంబాలు తీవ్రశోకంలో మునిగిపోయాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు.

# కూటమిలో చిచ్చురేపుతున్న యార్లగడ్డ పదవి

**మచిలీపట్నం, మే13( వెలుతురు):**
యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్.. ఈ పేరు తెలుగు రాజకీయాల్లో వినిపిస్తూనే ఉంటుంది. అలాగని ఈయన పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు కాదు. అయితేనేం ఏ ప్రభుత్వం ఉన్నా.. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఆయన స్థానం పదిలం. తాజాగా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఓ పదిమంది సలహా సంఘం సభ్యులను నియమించింది. అందులో ఒకరు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. ఆయనకు ఇప్పుడు ఎలా పదవి వచ్చింది అన్నది ప్రశ్న. తప్పకుండా కూటమి నేతల సహాయం ఆయనకు ఉంటుంది. ఆ సాయంతోనే ఆయన పదవి పొందారు. అయితే చంద్రబాబుతో పాటు టిడిపిని వ్యతిరేకించిన యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు పదవి ఎలా దక్కింది అన్నది ఇప్పుడు ప్రశ్న.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంచి గుర్తింపు పొందారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. నామినేటెడ్ పోస్టులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే గౌరవం కూడా దక్కించుకున్నారు. టిడిపి తో పాటు చంద్రబాబును విమర్శించడంలో పోటీపడేవారు. సహజంగానే ఇది జగన్ మోహన్ రెడ్డిని ఆకర్షిస్తుంది. అందుకే కీలకమైన నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తూ వచ్చారు. అయితే జగన్ గ్రాఫ్ పడిపోయిందని తెలుసుకున్నారో ఏమో కానీ.. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు సమయంలో నిరసిస్తూ నామినేటెడ్ పదవికి రాజీనామా చేశారు. అటు తరువాత కూడా జగన్ భజన చేయడం మానలేదు. చంద్రబాబు పై విమర్శలు కూడా మానలేదు. అటువంటి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు కూటమిలో పదవి దక్కడం మాత్రం నిజంగా విశేషమే. అయితే అది పెద్ద పదవి కాకపోయినా.. గత అనుభవాల దృష్ట్యా యార్లగడ్డకు ఇవ్వడం మాత్రం నిజంగా సాహసమే.2014 నుంచి 2019 మధ్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేసిన హడావిడి అంతా కాదు. అప్పటివరకు గుర్తించిన ప్రభుత్వాలకు భిన్నంగా చంద్రబాబు సర్కారు వ్యవహరించింది. ఆ మాస్టారు ని దూరం పెట్టింది. దీనిని సహించుకోలేకపోయారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. చంద్రబాబు



సర్కార్ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిందని రేచ్చిపోయారు. మాతృభాషను చంపేస్తారా అంటూ నిలదీశారు. జగన్మోహన్ రెడ్డి పంచన చేరి చంద్రబాబు సర్కార్ పై విషం చిమ్మే మేధావుల్లో చేరిపోయారు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. అప్పటినుంచి చంద్రబాబు సర్కార్ పై విమర్శలు చేయడమే ఆయన పని. అందుకే 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీప్రసాద్ కు రెండు పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయినా సరే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు సమయంలో ఆ రెండు పదవులకు రాజీనామా చేశారు. సరిగ్గా ఎన్నికల ముందు సీన్ చూసి కూటమి తరపున ప్రచారం చేస్తానని చెప్పుకున్నారు. కానీ ఆయన సేవలను కూటమి వినియోగించుకోలేదు.కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గంలో జన్మించారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. మంచి విద్యాధికుడు కూడా. ఆంధ్ర యూనివర్సిటీ హిందీ విభాగంలో ఆచార్యుడిగా పని చేశారు. హిందీలో ఎంఏ పట్టా పొందారు. తెలుగు హిందీ భాషల్లో పిహెచ్డి పట్టాలు కూడా సాధించారు. నందిగామ కె.వి.ఆర్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. ఏయూలో ఆచార్యుడిగా 29 మంది విద్యార్థులకు పీహెచ్డీ మార్గదర్శకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ హిందీ అకాడమీ చైర్మన్ గా, లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా చాలా రకాల పదవులు చేపట్టారు. పద్మ అవార్డులు కూడా దక్కించుకున్నారు. 1992లో అయితే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. అందుకే అన్ని ప్రభుత్వాలు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు ప్రాధాన్యమిస్తూ వచ్చాయి. అయితే ఇప్పుడు టిడిపిని వ్యతిరేకించిన లక్ష్మీప్రసాద్ కు పదవి రావడం మాత్రం విశేషమే.

# అర్ధం కాని పవన్ స్ట్రాటజీ

**విజయవాడ, మే13( వెలుతురు):**
జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మౌనంగానే ఉంటూ తాను అనుకున్నది సాధిస్తున్నట్లు కనపడుతుంది. పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు వరకూ కాస్త అగ్రెసివ్ గా కనపడేవారు. 2014 లో జనసేన పార్టీని పెట్టిన నాటి నుంచి ఆయన బహిరంగ సభల్లోనూ, రోడ్ షోల్లోనూ అన్ని పార్టీలపై విరుచుకుపడే వారు. తనకు ఒకసారి అధికారం ఇవ్వాలని పదే పదే కోరారు. 2019 ఎన్నికల్లో దారుణంగా ఓడించడంతో ఆయన ఆలోచన మారింది. 2014 తరహాలో కూటమిని ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వాన్ని అయితే గద్దెదించగలిగారు. పవన్ కల్యాణ్ అనుకున్నది సాధించారని, పట్టుదలతో ఆయన రాజకీయంగా తీసుకున్న వ్యూహాలు



ఫలించాయన్న ప్రశంసలు అందుకున్నారు. 2024 లో సూపర్ కాంబినేషన్ తో కూటమి హిట్ అయింది. 164 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన పార్టీ అయితే వందకు వంద శాతం స్ట్రయిక్ రేట్ ను సాధించింది. పోటీ చేసిన అన్ని శాసనసభ స్థానాల్లోనూ, పార్లమెంటు స్థానాల్లోనూ గెలుపొందింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పవన్ హర్ట్ కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నారు. పవన్ కల్యాణ్ మైండ్ సెట్ తెలిసిన చంద్రబాబు అందుకు అనుగుణంగా ట్యూన్ అయ్యారు. పవణ్ ఏదీ తనకు కావాలని అడగరు. కానీ పవన్ ఆలోచనలను గుర్తించి చంద్రబాబు వాటిని అమలు చేస్తుండటంతో పవన్ కల్యాణ్ కూడా ఖుషీ ఫీలవుతున్నారు. ప్రధానంగా ఆయన తనకు కావాల్సిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖను పట్టుబట్టి తీసుకున్నారు.ఆ శాఖకు సంబంధించి పవన్ నుంచి ఏదైనా నోట్ వచ్చిన వెంటనే దానికి సంబంధించిన నిధులు ఆగడానికి వీలులేదని చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు అధికారులకు జారీ చేశారు. పవన్ నుంచి వచ్చిన ఫైలు చూడాల్సిన పనిలేదని, నేరుగా తనకు ఆమోదం పంపాలని కూడా చంద్రబాబు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులకు చెప్పినట్లు టాక్. అందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి పవన్ తీసుకున్న నిర్ణయాలతో పాటు ఆయన కోరిన నిధులను కూడా వెంటనే సమకూర్చుతున్నారు. మరొక వైపు మంత్రి నారా లోకేశ్ కూడా పవన్ ను తన సోదరుడిగా సంభోదిస్తూ ఆయనకు మంచి గౌరవమిస్తూ కూటమి ట్రాక్ తప్పకుండా వ్యవహరిస్తున్నారు.ఇక ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత చంద్రబాబు ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా కలవకపోయినా నామినేటెడ్ పదవులు ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఆయన నుంచి అనుమతి తీసుకున్న తర్వాతనే జనసేనకు నామినేటెడ్ పదవులు కేటాయిస్తూ వస్తున్నారు. ఇటు జనసేన కూడా క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలంటే ఆ పార్టీ నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నది పవన్ అభిప్రాయం. ఈ మేరకు భర్తీ అయ్యే పోస్టుల్లో అగ్రభాగం టీడీపీ తీసుకున్నప్పటికీ జనసేనకు కూడా తగినన్ని ఇస్తూ పవన్ కల్యాణ్ మాటకు ప్రభుత్వంలో తిరుగులేదన్న సంకేతాలను చంద్రబాబు సయితం బలంగా పంపుతున్నారు. మొత్తం మీద మౌనంగా ఉండి పవన్ తనకు కావాల్సిన రీతిలో అన్నీ సాధించుకుంటున్నారని, ఇదొక రకం వ్యూహమని రాజకీయ విశ్లేషకులు అంటున్నా రు

# టీడీపీలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

**కర్నూలు, మే13( వెలుతురు):**
రాయలసీమలో అనూహ్య ఫలితాలు సాధించింది టిడిపి కూటమి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాంతంగా ఉండే రాయలసీమలో ఆ పార్టీకి దారుణంగా దెబ్బతీసింది. కూటమి వేవ్ లో చాలామంది నేతలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచారు. రాయలసీమలో ఈ స్థాయి విజయాన్ని చూసిన చంద్రబాబు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. చాలా రకాలుగా సూచనలు చేశారు. ఐకమత్యంతో ఉండి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎక్కడికక్కడే ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు ఉన్నాయి. రోజురోజుకు అవి తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో నివురు గప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఇలానే కొనసాగితే కష్టమని ప్రచారం జరుగుతోంది.కర్నూలు జిల్లాలో ఈసారి టిడిపి కూటమి సత్తా చాటింది. 2014, 2019 ఎన్నికల్లో ప్రభంజనం చాటిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ తోక ముడిచింది. కొత్త కొత్త నేతలు ప్రజాప్రతినిధులుగా మారారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి అనూహ్యంగా కర్నూలు ఎంపీ అయ్యారు. అయితే ఆది నుంచి శబరి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు కొందరు ఎమ్మెల్యేలతో విభేదాలు తలెత్తాయి.

కొన్ని సందర్భాల్లో బయటపడ్డాయి కూడా. ఆమె ఎమ్మెల్యేలను ఏమాత్రం లెక్క చేయడం లేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలోని చాలామంది ఎమ్మెల్యేలతో ఆమెకు పడడం లేదు. రాజాగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయ సూర్యకు, ఎంపీ శబరి కి మధ్య ఉన్న వివాదాలు రోడ్డు ఎక్కాయి. ఏకంగా అధికారిక కార్యక్రమంలో ఈ విభేదాలు



వెలుగు చూడడంతో జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.బైరెడ్డి కుటుంబ సొంత నియోజకవర్గం నందికొట్కూరు. ఆ నియోజకవర్గంలో పట్టు కోసం ఆ కుటుంబం పరితపిస్తుంది. అది రిజర్వుడు నియోజకవర్గం కావడంతో ఆ కుటుంబం పోటీ చేయడానికి వీలుపడడం లేదు. అయితే కర్నూలు నుంచి ఎంపీగా ఎన్నికైన శబరి నియోజకవర్గంలో పట్టు బిగించాలని చూస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఒక ఫైర్ స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి శంకుస్థాపన జరపాలని అధికారులకు మంత్రి అనిత ఆదేశించారు.

దీంతో అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రోటోకాల్ ప్రకారం కర్నూలు ఎంపీ, నందికొట్కూరు ఎమ్మెల్యేలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమానికి ఎంపీ ని ఎందుకు పిలిచారు అంటూ ఎమ్మెల్యే జై సూర్య అధికారులను ప్రశ్నించారు. ముహూర్తానికి ముందే ఎంపీ రాకుండానే శంకుస్థాపన చేశారు.

అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు.ఎంపీ శబరి వచ్చేసరికి ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం తాను వచ్చేదాకా ఎందుకు ఆగలేదని అధికారులను ప్రశ్నించారు. వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడితో ఆగకుండా ఎమ్మెల్యే చేసిన శంకుస్థాపనకు పక్కనే మరో శంకుస్థాపన చేశారు శబరి. అయితే ఎమ్మెల్యే జయ సూర్య వెనుక టిడిపి శ్రేణులు అధికంగా ఉన్నారు. ఎంపీ శబరి వెనుక మాత్రం పరిమిత సంఖ్యలో మాత్రమే కనిపించారు. మొత్తానికి అయితే కర్నూలు జిల్లాలో టిడిపిలో విభేదాలు స్పష్టంగా కనిపిస్తుండటం విశేషం. మరి హై కమాండ్ ఎలాంటి దిద్దుబాటు చర్యలకు దిగుతుందో చూడాలి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com